
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి
కొత్తగూడెం
16
శనివారం 6 జనవరి 2018



శుక్రవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 31 । కనిష్ఠం 14



కూలుతున్న ఆశల సౌధం..!



- అమెరికా కలను చెదరగొడుతున్న 'ట్రంప్ బూచి'
- హెచ్1బీ వీసా నిబంధనలు కఠినతరం చేయడమే కారణం
- ఉమ్మడి ఖమ్మం జిల్లావాసుల్లో ఆందోళన

అమెరికా.. డాలర్ల దేశం. మనవాళ్లు చదువుకునేందుకు.. ఉపాధి పొందేందుకు వలస వెళ్లే దేశం. నిన్నమొన్నటి దాకా శ్వేత సౌధం ఆశల సౌధంగానే కన్పించేది. సిలికాన్ వ్యాలీ రెడ్‌కార్పెట్ పరిచేది. రారమ్మని స్వాగతం పలికేది. కానీ ట్రంప్ అగ్రరాజ్యాధిపతి అయ్యాక పరిస్థితి తలకిందులైంది. స్వదేశీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. హెచ్1బీ వీసాపై నిబంధనలు కఠినతరం చేసింది. దీంతో మనవాళ్లల్లో ఆందోళన మొదలైంది.

- ఆంధ్రజ్యోతిప్రతినిధి, ఖమ్మం/కొత్తగూడెం

సెంటర్‌స్ప్రెడ్‌లో

- ఉమ్మడి ఖమ్మం నుంచి విదేశాల్లో ఉన్నవారు 40 వేల మంది
- చదువులకోసం వెళ్లినవారు 25వేల మంది
- ఏటా వెళ్లేవారు 5వేలమంది
- పాస్‌పోర్టుకోసం దరఖాస్తు చేస్తున్నవారు 13 వేల మంది

నేత్రపర్వంగా దొంగలదోపు

- కళ్లకుకట్టిన తిరుమంగై ఆళ్వార్ చరిత్ర
- ఆసక్తిగా తిలకించిన భక్తులు

2



దొంగల దోపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



టీ-20 మనదే

- ఫైనల్లో ఖమ్మంపై భద్రాద్రి జట్టు గెలుపు
- ముగిసిన నాలుగు జిల్లాల టోర్నీ
- విజేతకు బహుమతి ప్రదానం చేసిన డీఎస్పీ

3



బెల్లం బంగారం

- విక్రయాలపై ఎక్సైజ్ ఆంక్షలు
- సంక్రాంతికి పిండివంటలు కష్టమే
- మేడారం భక్తులకూ ఇబ్బందే
- ఇదే అదునుగా ధర పెంచిన వ్యాపారులు

సంక్రాంతి అంటే గుర్తొచ్చేవి అరిసెలు. కానీ ఈ సారి అవి చేసే పరిస్థితి లేదు. ఈనెలాఖరులో మేడారం సమ్మక్క సారక్క మహా జాతర. భక్తులు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. కానీ ఈసారి ఆ పరిస్థితి లేదు. ఎందుకంటే నల్లది, తెల్లది అని తేడా లేకుండా బెల్లంపై ప్రభుత్వం, ఆబ్కారీ శాఖలు నిషేధం విధించాయి. ఫలితంగా బెల్లం బంగారమైంది.

-మణుగూరు రూరల్

14

కట్టుకున్నోడే కడతేర్చాడు

- జల్సాలకు అడ్డొస్తోందని కిరాతకం
- భార్యను కిడ్నాప్ చేసి మరీ.. మెడకు చున్ని బిగించి హత్య
- ఇల్లెందులో కలకలం
- మృతురాలు ఖమ్మం జడ్పీలో టైపిస్టు
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు

కట్టుకున్నోడే కడతేర్చాడు కర్కశంగా.. మెడకు చున్ని బిగించి ఊపిరి ఆడకుండా చేశాడు పాశవికంగా.. రాక్షసానందాన్ని పొందాడు. వద్దన్నా పట్టించుకోలేదు. కాళ్లు పట్టుకుని ప్రాధేయపడినా కనికరించలేదు. అగ్ని సాక్షిగా చేతిలో చేయ్యేసి ఏడడుగులు వేసిన వాడు.. ఏడేడు జన్మలదాకా తోడుంటానని బాస చేసినవాడు.. ఆ చేతులతోనే చంపేశాడు. పిల్లలను అమ్మప్రేమకు దూరం చేశాడు. ఇంతకీ ఆ ఇల్లాలు చేసిన నేరం.. అతడి జల్సాలకు అడ్డురావడమే.. కుటుంబ బాధ్యతలను ఎందుకు విస్మరిస్తున్నావని ప్రశ్నించడమే..

-ఇల్లెందు

6



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న చిన్నారులు



పద్మ (ఫైల్)

ఆధ్యాత్మికం



రాపత్తు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నేత్ర పర్వంగా దొంగల దోపు

భద్రాచలం, జనవరి 5: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్యకు శుక్రవారం రాత్రి దొంగల దోపుఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి దొంగల దోపోత్సవాన్ని నిర్వహించగా వందలాదిమంది భక్తులు ఆహ్లాదకరంగా తిలకించారు. తిరుమంగై ఆళ్వార్ చరిత్రకు సంబంధించిన ఈ ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సమయంలో పరకాలుడు వేషధారి శంఖు, చక్రాలు, గొడుగు చోరీ చేయగా వాటిని భటులు స్వాధీనం చేసుకొని స్వామి వారి ముందు నిందితుడిని ప్రవేశపెడతారు. ఈ సమయంలో నిందితుడు తప్పు ఒప్పుకొని స్వామి వారిని క్షమించమని కోరతాడు. ఈ క్రమంలో పెరయ తిరుముడిలోని తొలి పది పాశురాలను అనుసంధానం చేసి పరకాలుడు వేషధారుడికి, భటులకు సన్మానం చేస్తారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వైదిక సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు శ్రీ సీతారామచంద్రస్వామి వారికి విశ్రాంతి మండపంలో రాపత్తు సేవ నిర్వహించారు.



పరకాలుడి వేషధారి నృత్యం

శబరి యాత్రలో చిన్నపిల్లలు (మణికంఠ స్వాములు) తప్పిపోతారనే చింత ఇక అక్కరలేదు. అయ్యప్ప సన్నిధిలో కేరళ ప్రభుత్వం ప్రత్యేక 'ఆర్ఎఫ్ఐడీ' వ్యవస్థను ఆరచణలోకి తెచ్చింది. నీరు, నిప్పు, వాతావరణ పరిస్థితులు ప్రభావింతం చేయలేని రేడియో ట్యాగ్‌లు చిన్నారులకు రక్షగా నిలుస్తున్నాయి. మెడలో ధరించడానికి వీలున్న ఈ సాంకేతిక పరికరాలను ఉచితంగా అందజేస్తున్నారు. జన ప్రవాహంలో ఎక్కడున్నా గంట వ్యవధిలో చెంతకు చేర్చే 'కంకణాల'పై ప్రత్యేక కథనం..

\- *అశ్వారావు పేట రూరల్*



శబరిమలై యాత్రలో చిన్నారులకు..

రక్షణ కవచాలు

పంబ పోలీస్ స్టేషన్‌లో ట్యాగ్‌లు
చిన్నారులు తప్పిపోకుండా చర్యలు
రేడియోధార్మిక విధానంలో గుర్తింపు

తెలుగు రాష్ట్రాల నుంచి 41రోజుల పాటు కఠోర దీక్షలు చేసిన అయ్యప్ప మాలాధరులు వేలాది కిలోమీటర్లు ప్రయాణించి మణికంఠుడి దర్శనానికి వెళతారు. ఏటేటా ఈసంఖ్య పెరుగుతూనే ఉంది. ఇక యాత్రలో భాగంగా భక్తుల రద్దీ అధికంగా ఉన్నపుడు, అనుకోని సంఘటనలు ఎదురైనపుడు కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన చిన్నారులు తప్పిపోతున్నారు. ప్రతీ సంవత్సరం వేలాది ఫిర్యాదులు పోలీసులకు అందుతున్నాయి. తప్పిపోయిన చిన్నారులను వెతకటం కుటుంబసభ్యులకు, పోలీసులకు కష్టమవుతోంది. కొందరు పిల్లలు కనిపించకుండా పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. కొందరి కుటుంబాల్లో యాత్ర కాస్తా విషాదయాత్రగా మారాయి. ఈనేపథ్యంలో శబరిమలై యాత్రకు వచ్చే చిన్నారుల క్షేమమే ధ్యేయంగా కేరళ పోలీస్ యంత్రాంగం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యాత్రకు వచ్చిన 14ఏళ్లలోపు చిన్నారులు తప్పిపోయిన సమయంలో ఎక్కడ ఉన్నా వారిని తల్లిదండ్రులకు అప్పగించేలా పటిష్ట చర్యలు చేపట్టింది. వోడాఫోన్ సౌజన్యంతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు.



చిన్నారులకు ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్స్

కేరళ పోలీసు శాఖ పంబలో యాత్రకు వచ్చే చిన్నారులకు రేడియో ఫ్రిక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ) ట్యాగ్‌లను అందజేస్తుంది. కొద్దిరోజుల క్రితం అయ్యప్ప ఆలయ కింది భాగంలోని పంబ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. యాత్రకు వచ్చే చిన్నారులకు పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేకంగా గుర్తింపు కార్డుమాదిరిగా ఒక ట్యాగ్‌ను అందిస్తారు. ఇది ఆరు కిలోమీటర్ల దూరం వరకు పనిచేస్తుంది. పంబ నుంచి సన్నిధానం వరకు చిన్నారులు ఎక్కడ ఉన్నా ఇట్టే గుర్తించవచ్చు. ఇందులో ప్రత్యేకంగా తయారుచేసిన చిప్‌ను ఉంచుతారు. దీనికి సంబంధించిన సమాచారం పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. పిల్లలు తప్పిపోయిన సమయంలో తల్లిదండ్రులు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే చిన్నారుల ఆచూకిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగిస్తారు.



ట్యాగ్ పొందే విధానం ఇలా

శబరిమల యాత్రకు బయలుదేరిన వ్యక్తులు ఎవరైనా తమ వెంట చిన్నారులు ఉంటే ముందుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలి. అక్కడ తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. చిన్నారులు ఎంతమంది ఉంటే వారికి ట్యాగ్‌లు అందిస్తారు. ఆయా ట్యాగ్‌లోనే పేరు, చిరునామా, మొబైల్ నెంబరుసంఖ్య ఇలా సమగ్ర సమాచారం క్రోడీకరించిన మీదటే చిన్నారులకు ట్యాగ్‌లను అందిస్తారు. పోలీసులు అందించే ఈట్యాగ్‌లు పంబ పోలీస్‌స్టేషన్ నుంచి ఆరు కిలోమీటర్ల వరకు పనిచేస్తాయి. అంటే పంబ నుంచి అయ్యప్ప సన్నిదానం వరకు ఉండే ఆరు కిలోమీటర్ల దూరంలో చిన్నారులు ఎక్కడ ఉన్నా ఇట్టే గుర్తించవచ్చు. చిన్నారులు తప్పిపోయి పోలీస్‌స్టేషన్‌కు వచ్చినా ట్యాగ్‌లో ఉన్న సమాచారం ఆధారంగా కుటుంబసభ్యులకు తెలియజేస్తారు. యాత్ర ముగిసిన తరువాత తిరుగు ప్రయాణంలో వాటిని అప్పగించాల్సి ఉంటుంది.

పోలీసుల సమయం ఆదా..

అయ్యప్ప దర్శనానికి వెళ్లే భక్తులలో చిన్నారులు ఒకరు తప్పిపోయినా చెప్పలేనంత ఇబ్బందిగా ఉంటుంది. నూతనంగా అమలుచేస్తున్న ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్ అందజేత ద్వారా పంబ పోలీస్‌స్టేషన్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఎక్కడ ఉన్నా ఇట్టే పట్టుకోవచ్చు. ఇది అంతా గంట వ్యవధిలోనే పూర్తవుతుంది. అంటే ట్యాగ్స్ విధానం ద్వారా పోలీసుల సమయం వందకు వందశాతం ఆదా అయి భక్తుల రక్షణలో ఉంటారు. మొత్తంగా పంబ పోలీసులు అందజేస్తున్న ట్యాగ్స్ ద్వారా తెలుగురాష్ట్రాల నుంచి వెళ్లే లక్షలాది మందికి చిన్నారులు తప్పిపోయారనే బాధ లేకుండా సంతోషంగా యాత్రను ముగించుకుని ఇంటికి చేరతారు.

మా నాన్నే నాకు ఆదర్శం..

8 జంగం బాలకృష్ణ, ఎస్‌బీఐ మేనేజర్, ముదిగొండ

● ముదిగొండ



రోజు ఉదయాన్నే టిఫిన్ బాక్స్ పట్టుకుని పనికోసం అడ్డామీదికి పోయేవాడు. పని దొరికిదే ఆరోజు సరుకులు కొనుక్కొచ్చేవాడు. లేకపోతే అంతే సంగతి. బడికి వెళ్లే నేను నాన్న సాయంత్రం నాకోసం ఏం కొనుక్కొస్తాడా అని ఎదురు చేసేవాణ్ని. చేతిలో తినుబండారాల పొట్లం కనిపిస్తే..సంబరమే.. అని తన స్వగతాన్ని వివరించారు ముదిగొండ ఎస్‌బీఐ మేనేజర్ జంగం బాలకృష్ణ. 'ఆంధ్రజ్యోతి' పలుకరింపుతో ఎంతో ఆత్మీయంగా మాట్లాడారు. ఆ ముచ్చట్లు మీకోసం..

నా రియల్‌హీరో మా నాన్నే

ఎన్ని కష్టాలెదురైనా మాకెవరికీ తెలియనివ్వకుండా చదువుల్లో ప్రోత్సహించారు. పండుగలకు తాను పాత దుస్తులు వేసుకున్నా.. మాకు కొత్తదుస్తులు కొనేవారు. బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని నాకు ప్రేరణ కల్గించారు.

మేస్త్రీ కుటుంబం

మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు గ్రామం. నాన్న జంగం నాగేశ్వరరావు సుతారి మేస్త్రీ. అమ్మ ముత్యాలమ్మ. ఇద్దరు సోదరులు పలు వ్యాపారాల్లో ఉన్నారు. నా సతీమణి శ్రీలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్లర్కు నుంచి మేనేజర్ వరకు..

పదోతరగతి వరకు ఇల్లెందు హైస్కూల్లో, హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ పూర్తిచేశాను. బీటెక్ రంగాజిల్లా జిల్లా ఏబీఐఎఫ్‌టీలో, ఎంబీఏ పూర్తిచేశాను. ఈ సమయంలోనే 2009లో ఎస్‌బీఐ బ్యాంకు క్లర్క్‌గా ముకుందాపురంలో ఉద్యోగం వచ్చింది. ఆతర్వాత విజయవాడ, నందిగామ, హైదరాబాద్‌లో ప్రస్తుతం ముదిగొండ ఎస్‌బీఐ మేనేజర్‌గా పనిచేస్తున్నా.

ప్రతీ పుస్తకంలో కొత్తదనం..

పుస్తకాలు చదవడం ఎంతో ఇష్టం. ఏకబిగిన చదివే అలవాటుంది. అప్పుడప్పుడు టీవీ చూస్తుంటా. చదివిన పుస్తకాల రచయితల పేర్లను రాసుకోవడం అలవాటు.

స్నేహితులెక్కువే..

పాఠశాల, కళాశాల మిత్రులు అంతా టచ్‌లోనే ఉన్నారు. సమయం దొరికిన ప్రతీసారీ క లుస్తుంటా. పదో తరగతిలో గ్రూప్ స్టడీస్ చేసేవాళ్లం. మిత్రులంతా ఒకరి పుస్తకాలు మరొరకం చదివేవాళ్లం. కాలేజీకి వచ్చాక లైబ్రేరీని బాగా ఉపయోగించుకున్నా.

9న నిరుద్యోగ యువకులకు ఇంటర్వ్యూలు

భద్రాచలంటౌన్, జనవరి 5: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకు లకు అప్రెంటీస్ శిక్షణ కల్పించే నిమిత్తం ఈ నెల తొమ్మిదో తేదీన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. ఎనిమిది వేల స్టైఫండ్ ఇస్తారని వివరించారు. 18-24మధ్య వయస్సుం డి ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 9న ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 91000 26084, 87906 16260 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



టీ-20 విజేత భద్రాద్రి

- రెండోస్థానంలో ఖమ్మం జట్టు
- ముగిసిన నాలుగు జిల్లాల లీగ్ క్రికెట్ పోటీలు

కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్,జనవరి5: గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న టీ-20 జోనల్ స్థాయి విజేతగా జిల్లా జట్టు నిలిచింది. రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా తొలిసారిగా జి. వెంకటస్వామి మెమోరియల్ ఆధ్వర్యంలో ఈ పోటీలను ప్రారంభించింది. మూడు రోజులుగా కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మొత్తం 8 జోన్‌లుగా విభజించారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 జట్లు వివిధ జిల్లాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా కొత్తగూడెంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జట్లు పాల్గొన్నాయి.

ఫైనల్‌లో తలపడిన ఖమ్మం, కొత్తగూడెం

ఈ జోనల్ క్రికెట్ పోటీలు ఫైనల్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జట్టుతో ఖమ్మం జట్టు తలపడింది. జిల్లా జట్టు జోనల్ విజేతగా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భద్రాద్రి కొత్తగూడెం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో టోర్నీలో అత్యధికంగా ఐదు వికెట్ల నష్టానికి 209 పరుగులు సాధించింది. ఓపెనర్ బి. సాయికుమార్ ఆకాశమే హద్దుగా కేవలం 53 బంతుల్లోనే 124 పరుగులు చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 11సిక్స్‌లు నమోదుచేసి జట్టు భారీ ఇన్నింగ్స్ కీలక భూమిక పోషించాడు. ఖమ్మం జట్టు బౌలింగ్ విభాగంలో జె. హరీష్ 52 పరుగులిచ్చి, 2వికెట్లు, కే. అభిలాష్ 37 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఖమ్మం జట్టు 20ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి, 120 పరుగులు చేసింది. ఖమ్మం ఇన్నింగ్స్‌లో అభిలాష్ 32 పరుగులు, శ్రీనివాసరావు 22పరుగులు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం బౌలింగ్‌లో సుధీర్ 23 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు అజయ్ యాదవ్ 22 పరుగులు ఇచ్చి ఒక వికెట్, సాయివంశీ 19 పరుగులు ఇచ్చి ఒక వికెట్ సాధించారు. జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన బి.సాయికుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు ఇచ్చారు. రూ.20వేల నగదు, ప్రోత్సాహక బహుమతిని ఉమ్మడి జిల్లాల హెచ్‌సీఏ సభ్యుడు చేకూరి వెంకట్ అందజేశారు. జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి బట్టు ప్రేమ్‌కుమార్ వెయ్యిరూపాయలు బహుమతి అందజేశారు. తదనంతరం జరిగిన కార్యక్రమంలో చేకూరి వెంకట్ మాట్లాడుతూ... 9, 10తేదీల్లో సెమీ ఫైనల్స్ నిర్వహిస్తామని, ఇందులోపాల్గొనే జట్ల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.



రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం జట్టుతో డీఎస్పీ, ఉమ్మడి క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

జాతీయ స్థాయిల్లోను రాణించాలి డీఎస్పీ ఎస్‌ఎం. అలీ

జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని డీఎస్పీ ఎస్‌ఎం. అలీ అన్నారు. పోటీలు ముగింపు సందర్భంగా బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చేకూరి వెంకట్ మాట్లాడుతూ... గెలిచిన జిల్లా జట్టులోని క్రీడాకారులకు, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీకే. మనోహర్, ఉమ్మడి జిల్లాల క్రికెట్ కోచ్ సన్నీ సోబర్స్, జిల్లా మేనేజర్ జి. రాకేష్, జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి బట్టు ప్రేమ్ కుమార్, ఆదిత్య మెన్స్‌వేర్ నిర్వాహకులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న సాయి కుమార్

రాష్ట్రస్థాయి పోటీలకు ఇల్లెందు విద్యార్థులు

ఇల్లెందుటౌన్,జనవరి5: రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఇల్లెందుకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. రేపు,ఎల్లుండు గోదావరిఖనిలో జరుగనున్న పోటీలకు స్థానిక దుర్గగోల్డెన్‌జిమ్‌కు చెందిన గంగాభవాని, భట్టు స్వేత, శ్రావణి, శిరీష, బిందు, స్వర్ణ, సరస్వతి, హారిక, విద్యారాణి, రోశినిపాసి, అక్షిత్‌యాదవ్ ఎంపికయ్యారు. పురుషుల విభాగంలో సాయికార్తీక్, ఎస్.సన్నీ ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపికపట్ల కోచ్‌లు కావేటి రమేష్‌యాదవ్, చీమల సుజాత, కే.భార్గవ్, రాకంశ్యాంబాబు, డాక్టర్ రవికుమార్, సిరిమల్ల రాజు హర్షం వెలిబుచ్చారు.

డ్రైవర్‌కు ఆరునెలల జైలు

దుమ్ముగూడెం జనవరి5: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఆరునెలల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించారు. ఈ మేరకు భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కేకేవి బుల్లికృష్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. దుమ్ముగూడెం మండలంలోని నరసాపురం ప్రధాన రహదారిపై 2013 నవంబరులో ప్రమాదం జరిగింది. అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్వర్లును నల్లగొండకు చెందిన డ్రైవర్ కటుకూరి చంద్రశేఖర్ డీసీఎం వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టాడు. ప్రమాదంలో వెంకటేశ్వర్లు(54) మృతి చెందాడు. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఆధార్ సీడింగ్ పేరుతో డబ్బులు లాగేశాడు

- వ్యాపారిఖాతా నుంచి రూ.97వేలు డ్రా

కూసుమంచి, జనవరి5: జీఎస్టీ వచ్చినందున బ్యాంకు ఖాతాకు ఆధార్‌నెంబరు జతపర్చాలంటూ.. ఓ సైబర్ నేరగాడు రూ.97వేలు లాగేశాడు. ఈ ఘటన శుక్రవారం కూసుమంచిలో వెలుగుచూసింది. మండల పరిధిలోని ఎర్రగడ్డతండాలో గరిణె రామకృష్ణ అనే వ్యక్తి చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఆంధ్రాబ్యాంకు పాలేరు బ్రాంచ్‌లో ఖాతా ఉంది. గురువారం మధ్యాహ్నం రామకృష్ణకు ఫోన్ వచ్చింది. హిందీ భాషలో మాట్లాడుతూ తాము ఆంధ్రాబ్యాంకు మెయిన్ బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. కొత్తగా జీఎస్టీ వచ్చినందున బ్యాంకు ఖాతా తిరిగి ఆధార్ సీడింగ్ చేయాల్సి ఉందని, ఆధార్ నెంబరు చెప్పాలని కోరాడు. దీంతో నిజమేనని భ్రమపడిన రామకృష్ణ ఆధార్‌నెంబరు చెప్పాడు. సదరు ఖాతాదారుడి సెల్‌కు వన్‌టైమ్ పాస్‌వర్డు వచ్చింది. సదరు సైబర్ నేరగాడు మరోమారు కాల్ చేసి ఓపీటీ నంబర్ అడిగాడు. ఈ నెంబరు చెప్పటంతో అతడి ఖాతాలో రు.99వేల వరకు ఉండగా 97వేలు ఆన్‌లైన్‌లో డ్రా చేసుకున్నాడు. బాధితుడు కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మిషన్ భగీరథ పనుల అడ్డగింత

- మార్చురీ వెనుక ట్యాంకు పనులు
- డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లివైనం

బూర్గంపాడు,జనవరి05: మిషన్ భగీరథ వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులను శుక్రవారం గ్రామస్థులుఅడ్డుకున్నారు. బూర్గంపాడు క్లస్టర్ ఆసుపత్రి ఆవరణంలోని మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించే గది(మార్చురీ) వెనుక ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణ పనులను గ్రామస్థులు అడ్డుకొని, ఆసుపత్రి తనిఖీకి వచ్చిన డీఎంహెచ్‌వో దయానందస్వామి దృష్టికి తీసుకెళ్లారు. వ్యాధులు, రోడ్డు ప్రమాదాలు, వివిధ రకాలుగా మరణించిన వారికి ఇక్కడే పోస్టుమార్టం నిర్వహిస్తారని, దీంతో బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుందన్నారు. దీనిపై దయానందస్వామి మాట్లాడుతూ ఇప్పటివరకు ఆసుపత్రి ఆవరణలో వాటర్‌ట్యాంకు నిర్మాణం చేపట్టిన విషయం తనకు తెలియదన్నారు. ఆసుపత్రి ఆవరణలోనిర్మాణం చేపట్టడం సమాంజసం కాదన్నారు. తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. పనులు అడ్డుకున్న వారిలో తెలుగు యువత నాయకులు దుద్దుకూరి.రాజా,దుగ్గిరాల.శ్రీరాం రెడ్డి,యండి.నాజీర్,కాకర్ల.ప్రతాప్,డా.విష్ణు,సుధాకర్ రెడ్డి, టింకు,ప్రశాంత్ ఉన్నారు.



జిల్లావైద్యాధికారి దయానందస్వామితో మాట్లాడుతున్న గ్రామస్థులు

రవాణా చార్జీలు పెంచండి

- ఆయిల్‌ఫెడ్ ఎండీకి పామాయిల్ రైతుల వినతి

దమ్మపేట, జనవరి 5: పామాయిల్ గెలల రవాణా చార్జీలను పెంచాలని పామాయిల్ రైతు సంక్షేమ సంఘం ఆయిల్‌ఫెడ్ ఎండీ వీరబ్రహ్మయ్యను కోరింది.అప్పారావుపేట పామాయిల్ కర్మాగారానికి శుక్రవారం వచ్చిన బ్రహ్మయ్యను ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు కలసి వినతి పత్రం అందచేశారు. 2015లో కర్మాగారానికి 15 కిలోమీటర్ల దూరం లోపు గెలలు టన్ను రవాణా చేసినందుకు రూ.225, 15కిలోమీటర్లు పైబడితే 300 నిర్ణయించి అమలు చేస్తున్నారని వివరించారు. ప్రస్తుతం డీజిల్ ధర, ట్రాక్టర్ల మెయింట్సనెన్స్‌పెరిగాయని వివరించారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా రవాణా చార్జీలను పెంచాలని కోరారు. ప్రపంచ అత్యుత్తమ టెక్నాలజీతో అప్పారావుపేట కర్మాగారం నిర్మాణంలో కీలక పాత్ర వహించినందుకు వీరబ్రహ్మయ్యను సత్కరించారు. కార్యక్రమంలో రైతుసమన్వయ సంఘం నేత పైడి వెంకటేశ్వరరావు, ఆత్మ చైర్మన్ కే.వి.సత్యనారాయణ, నెక్కంటి సాయిబాబ, కొల్లి వెంకటరమణ, శీమకుర్తి వెంకటేశ్వరరావు ఉన్నారు.



వినతి పత్రం పరిశీలిస్తున్న ఎండీ

'సేవాభావాన్ని అలవర్చుకోవాలి'

భద్రాచలంటౌన్, జనవరి5: ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని జిల్లావైద్యాధికారి దయానందస్వామి అన్నారు. శుక్రవారం భద్రాచలంలో నిర్వహించిన ఉచిత కంటి శస్త్రచికిత్స శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కేవీవీ బుల్లికృష్ణ ప్రారంభించారు. భద్రాచలంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, అవోపా, లయన్స్ క్లబ్, వికాస తరంగిణి, మమత జనరల్‌ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. 350మందికి పరీక్షలు నిర్వహించారు. 250మందికి కంటి అద్దాలు ఏర్పాటు చేశారు. 60మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి కళాశాల కరస్పాండెంటు డా. ఎస్.ఎల్. కాంతారావు, మమత జనరల్ ఆసుపత్రి ప్రొఫెసర్ డా.విజయకుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ కార్యదర్శి కె.మదన్‌మోహన్‌రావు, వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, బ్రహ్మారెడ్డి, జి.వెంకటాచారి, చారుగుళ్ల శ్రీనివాసరావు, రేపాక రామారావు, డా. జివివి సుదర్శన్, టి.సిద్దులు పాల్గొన్నారు.

పినపాక

పినపాక - మణుగూరు - బూర్గంపాడు
అశ్వాపురం - కరకగూడెం - గుండాల - ఆళ్లపల్లి

తహసీల్దార్‌కు ఏటీఎఫ్ వినతి

అశ్వాపురం జనవరి 5: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (ఏటీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. విద్యా,ఉద్యోగాలను కొల్లగొడుతున్న లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకూ ఉద్యమం ఆగదని ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్సం అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు చాపల రమేష్, పూనెం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

మణుగూరు

- సత్యభాస్కర ఒక్కక్షణం
- సీతారామ ఎంసీప

పినపాక మండల అధికారుల సమాచారం

తహసీల్దార్	9652528386
ఎంపీడీవో	9440906951
ఎంఈవో	9959087110
సీఐ బయ్యారం	9440795328
ఎస్ఐ, కరకగూడెం	9440904284
ఎస్ఐ బయ్యారం	9440904283
రేంజ్ అధికారి	9440816277
విద్యుత్ ఏడీఈ	9440811536
వెలుగు ఏపీఎం	9704789715
సీడీపీవో	7095556826
పీఆర్ ఏఈ	9959156956
ఇరిగేషన్ ఏఈ	9652177622
ఐటీడీఏ ఏఈ	8142574999
వ్యవసాయాధికారి	72888942

ప్రమాదాల మలుపు

తరచూ దుర్ఘటనలు.. రాత్రి వేళ అంధకారం.. పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా మారిన ఓసీ రహదారి

మణుగూరు రూరల్, జనవరి5: పట్టణంలోని మణుగూరు-ఏటూరునాగరం ప్రధాన రహదారిపై నుంచి మణుగూరు ఓసికే వేళ్లే మూల మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలోనే ఎక్కడెక్కడి నుంచో బొగ్గు లోడింగ్ కోసం వచ్చిన లారీలతోపాటు స్థానిక లారీ అసోసియేషన్‌కు సంబంధించిన లారీలు ప్రధానరహదారికి ఇరువైపులా, మణుగూరు ఓసికి వేళ్లే మూలమలుపు వద్ద నిలిపి ఉంచుతుంటారు. ఇరువైపులా వాహనాలు ఉండటంతో.. మలుపు వద్ద తరచూ ప్రమాదాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. దీనికి తోడు రాత్రి సమయాల్లో ఈ ప్రాంతం పూర్తి అంధకారాన్ని ఉంటుండం వల్ల వాహన సక్రమంగా కనిపించ ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. ప్రధాన రహదారిపైనుంచి వెళ్తున్న వాహనాలు మణుగూరు ఓసీ వైపు వెళ్తాయో.. లేదా నేరుగా ఏటూరునాగరం వైపు వెళ్తాయో కూడా తెలుసుకునే పరిస్థితి ఒక్కో సారి ఉండటం లేదని వాహనదారులు వాపోతున్నారు. అకస్మాత్తుగా వాహనాలను మలుపు తిప్పుతుండటం వల్ల ప్రమాదాలు జరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణుగూరు ఓసీ నుంచి ప్రధానరహదారిపైకి వచ్చేప్పుడు మూల మలుపు వద్ద పల్లంగా ఉండడంతో వాహనాలు స్పీడ్‌గా వచ్చి అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతంలో సరిపడా విద్యుత్ దీపాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది.

రబీ రుణాల పంపిణీ



రుణాలు అందజేస్తున్న ఛైర్మన్ మల్లారెడ్డి

అశ్వాపురం జనవరి 5: నెల్లిపాక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రబీరుణాలను పంపిణీ చేశారు. అశ్వాపురం సహకారబ్యాంకు కార్యాలయంలో రైతులకు నెల్లిపాక సింగిల్ విండో ఛైర్మన్ మర్రి మల్లారెడ్డి రుణాలు అందజేశారు. సంఘం పరిధిలోని 56 మంది రైతులకు రుణాలు అంద జేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు కోడి అమరేందర్, కమటం సురేష్, సీఈవో శివకుమార్, సిబ్బంది లక్ష్మణ్‌రావు,శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి 144 సెక్షన్

ఆళ్లపల్లి,జనవరి 5: మండలంలో ఆళ్లపల్లి, మర్కోడు, అనంతోగు పంచాయితీల్లో ఈ నెల 14వ తేదీ వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆళ్లపల్లి ఎస్ఐ మేకల కుమారస్వామి తెలిపారు. గ్రామాల్లో నలుగురికంటే ఎక్కువ జనాలు గుమిగూడి సభలు నిర్వహించినా, గుమికూడినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వాలీబాల్ పోటీల ప్రారంభం

బూర్గంపాడు,జనవరి5: అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం రాంపురం గ్రామంలో నిర్వహించారు. పోటీలను సీపీఐ రాష్ట్రకార్య వర్గ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షకార్యదర్శులు రాజు, శ్రీను, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు, నర్సయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

10నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

మండలకేంద్రమైన బూర్గంపాడులో ఈ నెల 10 నుంచి యూసుఫ్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పోటీలలో పాల్గొనదలచిన వారు ఈ నెల ఎనిమిదో తేదీలోగాపేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

కరకగూడెం, జనవరి 5:మండల పరిధిలోని వీరాపురం క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం కరకగూడెం ఎస్ఐ రాజ్‌కుమార్ వాహన తనిఖీలు నిర్వహించారు. ధ్రువపత్రాలు పరిశీలించి.. అనుమానితులను ప్రశ్నించారు.

బదిలీ వర్కర్లకు పదోన్నతులు

మణుగూరు, జనవరి5: మణుగూరు సింగరేణి ఏరియాలోని కొండాపురం భూగర్భ గనిలో బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికలకు జనరల్ మజ్దూర్‌లుగా పదోన్నతి కల్పిస్తూ.. గని ప్రాజెక్ట్ ఆఫీసర్ లలిత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పథంలో గని నిర్వహణకు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. కార్మికులందరూ ఐక్యంగా కలిసి పనిచేసి అత్యధిక ఉత్పత్తికి సహకరించాలని కోరారు. రానున్నకాలంలో ఈ గని రెండు కంటిన్యూయస్ మైనర్లు రానున్నాయని, ఏకకాలంలో ఒకే గనికి రెండు మైనర్లను ఇవ్వడం ఇదే తొలిసారన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ కృష్ణప్రసాద్, ఎస్‌వో మధుబాబు, అండర్‌మేనేజర్ భరత్‌బాబు, నాయకులు సాగర్, మౌలానా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులకు

ప్రతిపాదనలివ్వండి: ఎమ్మెల్యే



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు, జనవరి5: నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు ఇవ్వాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఇల్లెందు అతిథిగృహంలో ఐసీడీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షసమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మంచినీటి వసతి ప్రకారం కావాల్సిన భవనాలకు ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఆ సమస్యల పరిష్కారానికి సగం నిధులు తానిస్తానని, మిగతా సగం నిధులు ప్రభుత్వంచే మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ విజయనిర్మల, నియోజకవర్గంలోని బూర్గంపాడు, మణుగూరు సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ట్రాన్స్‌కో ఏఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రవి పాల్గొన్నారు.

'టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి'

అశ్వాపురం: టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీకి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. కార్యక్రమంలో బూర్గంపాడు మార్కెట్ కమిటీ ఛైర్మన్ విజయ నిర్మల, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నిర్వాసితుల వినతి



వినతిపత్రం ఆందజేస్తున్న దృశ్యం

బూర్గంపాడు, జనవరి5: సీతారామ కాలువ నిర్వాసితులు శుక్రవారం జడ్పీటీసీ బట్టా విజయగాంధీ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుని కలిసి వినతిపత్రం ఆందజేశారు. బూర్గంపాడు మండలపరిధిలోని నకిరిపేట, కృష్ణాసాగర్, టేకులచేరువు, పినపాకపట్టీనగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో గల సీతారామప్రాజెక్టు క్రింద భూములు కోల్పోతున్న రైతులు కొంత మందికి పాస్ పుస్తకాలు లేవని కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి విలువను బట్టి పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఆందజేసిన వారిలో బొర్ర భద్రయ్య, తాటి సూరయ్య, మల్లయ్య, సత్యనారయణ, తాటి సావిత్రి, తిరుపతమ్మ, జోగమ్మ ఉన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పాయం

మణుగూరు, జనవరి5: అశ్వాపురం మండలం తుమ్మల చెరువు గ్రామానికి చెందిన పలుపార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం టీఆర్ఎస్‌లో చేరారు. మణుగూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ చేరిక జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీఆర్ఎస్ అభివృద్ధిని చూసి.. పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు.

ప్యానల్ బృందం తనిఖీ

దుమ్ముగూడెం జనవరి 5: మండలంలోని కొత్తపల్లి గిరిజన ఆశ్రమపాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమశాఖ ప్యానల్ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. బోధనాతీరు, సీసీఈ పద్ధతి, విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయ, విద్యార్థుల క్రమశిక్షణ, హెచ్ఎం పనితీరు వంటి పలు అంశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జగపతితోపాటు బృంద నాయకులు ఎల్‌రామారావు, బృంద సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమాలు

భద్రాచలం

- ఉదయభాస్కర్ మిడిల్ క్లాస్ అబ్బాయి
- విజయభాస్కర్ హలో
- గోపాలకృష్ణ టైగర్ జిందాబాయి
- శివం (సారపాక) రోమియో జూలియట్

దుమ్ముగూడెం అధికారుల సమాచారం

తహసీల్దార్	:7680026361
ఎంపీడీఓ	:9440906956
ఎస్ఐ	:9440795307
ఎంఈఓ	:9912170410
రేంజిఅధికారి	:9440810347
విద్యుత్‌శాఖ ఏఈ	:9440811554
మండల ఏఓ	:7288894265
పీఆర్ జేఈ	:9440564966
ఈఓఆర్డీ	:9492091891
ఎక్సైజు సీఐ	:9440902683
వెటర్నరీ వైద్యుడు	:9704068729
దుమ్ముగూడెం పీహెచ్‌సీ	:9989027131
నరసాపురం పీహెచ్‌సీ	:8977425496
పర్ణశాల పీహెచ్‌సీ	:9963300896
తాలిపేరు డీఈ	:7075238444
ఇరిగేషన్ ఏఈ	:9100040649
టెలికాం ఏఈ	:9441558855

భద్రాద్రిలో ఎన్నికల సందడి

మొదలైన ప్రచారం

నేడు నామినేషన్ల ఉపసంహరణ



బీజేపీ నేతల ప్రచారం..



సీపీఎం ఇంటింటి ప్రచారం..

భద్రాచలంటౌన్, జనవరి 5: భద్రాచలంలో ఎన్నికల సందడి మొదలైంది. ఎంపీటీసీ-7 ఉప ఎన్నిక నామినేషన్ల పర్వం ముగిసింది. శనివారం నామినేషన్ల ఉపసంహరణ జరగనుంది. ఇప్పటికే టీడీపీ, బీజేపీ, సీపీఎం నాయకులు తమ అభ్యర్థులతో ప్రచారం మొదలుపెట్టారు. ఎంపీటీసీ-7లో 3302 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు గాను ఈ నెల 11న ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. 13న కౌంటింగ్ చేయనున్నారు. ఈ క్రమంలో అధికారులు ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. నిన్నటి మొన్నటి వరకు స్తబ్దతగా ఉన్న భద్రాచలం పట్టణం ఎంపీటీసీ-7 ఉప ఎన్నిక పుణ్యాన కాలనీల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది.



టీడీపీ ప్రచారంలో పాల్గొన్న కోనేరు చిన్ని

మొదలైన పార్టీల ప్రచారం

ఎంపీటీసీ-7 ఎన్నికలకుగాను సీపీఎం, టీడీపీ, టీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఇందులో టీఆర్ఎస్ తరపున ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో శనివారం జరిగే ఉపసంహరణలో ఇరువురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాల్సి ఉంది. అయితే ఇప్పటికే సీపీఎం తరపున బరిలో నిలిచిన కుంజా విజయ, టీడీపీ తరపున బరిలో నిలిచిన తాటి సావిత్రి, బీజేపీ తరపున బరిలో నిలిచిన సున్నం భూ లక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ ఆయా పార్టీల నాయకులు ప్రచారం మొదలు పెట్టారు. గురువారం నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం టీడీపీ అభ్యర్థి తాటి సావిత్రి విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు చిన్ని ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు సైతం మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. అదేవిధంగా భద్రాచలంలో ఎలాగైనా ఎన్నికల్లో బోణీకొట్టాలనే ఆశతో ఉన్న బీజేపీ అదే ఉత్సాహంతో సున్నం భూలక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం ప్రారంభించింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో బీజేపీ నాయకులు ఎర్రంరాజు బెహర, సతీష్ తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేదలకు కేంద్రం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వివరిస్తున్నారు. రాష్ట్రంలో పేదలకు ఒనగూరింది ఏమీ లేదని నేతలు ఈ సందర్భంగా ప్రచారం చేస్తున్నారు. బీజేపీని గెలిపిస్తే.. పేదల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తామని హామీనిస్తున్నారు. సీపీఎం అభ్యర్థి కుంజా విజయ విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు ఏజే రమేష్, బి.వెంకటరెడ్డి, ఎంబీ నర్సారెడ్డి, జీఎస్ శంకర్‌రావు తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ప్రతీ ఇంటికీ వెళ్లి.. తమ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకం

ఈ నెల 11న జరిగే ఎంపీటీసీ-7 ఉప ఎన్నిక ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. గతంలో ఇదే స్థానంపై గెలుపొందిన అజ్మీర సుమిత్రి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా టీడీపీ అభ్యర్థికి కాంగ్రెస్, సీపీఐ, ఆదివాసీ సంఘాలు మద్దతును ప్రకటించాయి. తద్వారా ఈ ఎన్నికలో తమ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతోంది. సీపీఎం సైతం గతంలో కొద్ది తేడాలో కోల్పోయిన ఈ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. బీజేపీ మరోమారు తమ అదృష్టాన్ని పరిక్షించుకునేందుకు గాను ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆ దిశగా పావులు కదుపుతోంది. అధికార పార్టీ టీఆర్ఎస్ మాత్రం ఇప్పటి వరకు తమ అభ్యర్థిని ఖరారు చేయకపోవడం విశేషం. నామినేషన్లు వేసిన ఇస్లావత్ స్వరూప, బానోతు దుర్గ, అంబటికర్ర సామ్రాజ్యంలలో ఎవరో ఒకరిని అభ్యర్థిగా శనివారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఖరారు చేయనుంది.

ఉద్యోగులు సేవాభావంతో పని చేయాలి: సబ్ కలెక్టర్

భద్రాచలంటౌన్, జనవరి 5: ఉద్యోగులందరు సేవాభావంతో పని చేయాలని భద్రాచలం సబ్‌కలెక్టర్ పమేలా సత్పధి అన్నారు. శుక్రవారం టీఎన్‌జీవో డివిజన్ అధ్యక్షుడు నర్సింహారావు ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్‌ను కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఉద్యోగులందరూ సమష్టిగా, సేవాభావంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోల సంఘం డివిజన్ కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణ, నాయకులు పడిగ నర్సింహారావు, గజ్జెల శ్రీనివాస్, భూక్య రామకృష్ణ, లింగమూర్తి, ఆంజనేయులు, రమేష్, ఈశ్వర్, గణేష్, విజయ్, రాజేష్



టీఎన్‌జీవో నేతలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

పాల్గొన్నారు. అంతర్జాతీయ గాంధీపథం కన్వీనరు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి సైతం సబ్‌కలెక్టర్‌ను అభినందించారు.

'వర్గీకరణపై చిత్తశుద్ధి చూపాలి'

భద్రాచలంటౌన్, జనవరి 5: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధకు బీజేపీ చిత్తశుద్ధి చూపాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవాకం బీజేపీ నేతలకు వినతిపత్రం సమర్పించారు. భద్రాచలంలోని బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించి... వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దేపంగి రమణయ్య, రాష్ట్ర నాయకులు అలవాల రాజా పెరియార్ మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్.అమర్‌నాథ్, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొప్పుల తిరుపతి, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు ప్రభాకర్, వీర రాఘవులు, ముత్తయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన కేసీఆర్

8 **టీడీపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు చిన్ని**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిన్ని

భద్రాచలంటౌన్, జనవరి 5: పుణ్యక్షేత్రమైన భద్రాచలం అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు పూర్ణ చంద్రరావు(చిన్ని) విమర్శించారు. శుక్రవారం భద్రాచలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామక్షేత్రమైన భద్రాద్రి అభివృద్ధి ప్రకటనలకే పరిమితమైందన్నారు. విభజన సమయంలో భద్రాద్రి అన్నిరకాలుగా తీవ్రంగా నష్టపోయిందన్నారు. సీపీఎంకి చెందిన ఎమ్మెల్యే వల్ల కూడా అభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. ఎంపీటీసీ-7 ఉప ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు, టీఆర్ఎస్, సీపీఎంకు లేదన్నారు. సమావేశంలో టీడీపీ ఎంపీటీసీ-7 అభ్యర్థి తాటి సావిత్రి, సీపీఐ పట్టణ కార్యదర్శి తమ్మళ్ల వెంకటేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ బాధ్యురాలు కొమరం ఫణీశ్వరమ్మ, టీడీపీ అధికార ప్రతినిధి శ్రీనివాసన్, కాంగ్రెస్ అధ్యక్షుడు రంగారావు పాల్గొన్నారు.

బెల్లం వ్యాపారిపై కేసు నమోదు

దుమ్ముగూడెం జనవరి 5: మండలంలోని చిన నల్లబెల్లికి చెందిన కిరాణా వ్యాపారి పత్తి సత్యనారాయణపై ఎక్సైజుశాఖ అధికారులు శుక్రవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నాటుసారాకు ఉపయోగించే నాలుగు వందల కేజీల పంచదార, పదికేజీల బెల్లం, మూడు కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెద నల్లబెల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై నాటుసారా రవాణా చేస్తూ పట్టుబడగా వారిపై సైతం కేసు నమోదు చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. దాడుల్లో సీఐ ఎల్‌జయశ్రీ, ఎస్ఐ ముత్యాలు, సిబ్బంది పాల్గొన్నారు. పంచదార లక్ష్మీనగరానికి చెందిన వ్యాపారి నుంచి కొనుగోలు చేశానని సత్యనారాయణ సీఐకు తెలిపారు.

కేసీఆర్, తుమ్మల చిత్ర పటాలకు క్షీరాభిషేకం

చర్ల, జనవరి 5: వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్‌ను ఇస్తున్న నేపథ్యంలో రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. శుక్రవారం చర్ల మండలంలోని జీపీపల్లిలో రైతులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి తుమ్మల నాగేశ్వరావు చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు కడెం సత్యనారాయణ, పోలిన రామచంద్ర రావు మాట్లాడుతూ రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వడం చాలా సంతోష కరమని అన్నారు. ముఖ్యమంత్రి మేలు మర్చి పోమన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుచూరి రవికుమార్, నాయకులు శ్రీనివాస యాదవ్, వెంకట్, వరప్రసాద్, శ్రీనివాస రెడ్డి,



క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రాజారావు, వేణు, కోదండ రామయ్య, రాధా కృష్ణ, నల్లూరి శ్రీనివాస్ ఇర్పా వసంత్, బాబి తదితరులు పాల్గొన్నారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

- కిడ్నాప్ చేసి హత్య
- ఇల్లెందులో కలకలం
- మృతురాలు ఖమ్మం జడ్పీలో టైపిస్టు
- నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లాపరిషత్ ఉద్యోగుల నిరసన

ఇల్లెందు, జనవరి 5: కట్టుకున్న భర్త కాలయముడయ్యాడు. మరో మహిళతో వివాహేతర సంబంధం నెరుపుతూ భార్యను కిడ్నాప్ చేసి హత్య చేశాడు. ఈసంఘటన ఇల్లెందులో జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లెందులోని ఇందిరానగర్‌కు చెందిన పులిగండ్ల మల్లయ్య దంపతులకు ఏకైక కూతురైన పద్మ.(29) ఈమెను ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం తొడిదెలగూడేనికి చెందిన బండారి ప్రభాకర్‌కు 12 ఏళ్ల క్రితం ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి అమ్మాయి, అబ్బాయి సంతానం. మల్లయ్య ముకుందాపురం జడ్పీఎస్ఎస్‌లో అటెండర్‌గా పని చేసేవాడు. విధి నిర్వహణలో ఉండగానే అనారోగ్యంతో మృతి చెందాడు. ఈనేపథ్యంలో ఏకైక కూతురైన పద్మకు కారుణ్య నియామకంలో ఉద్యోగం లభించింది. ప్రస్తుతం ఆమె ఖమ్మం జిల్లా పరిషత్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేస్తోంది. పద్మ, ప్రభాకర్ రెండేళ్ల క్రితమే ఖమ్మంలో కాపురం పెట్టారు. ఏ బరువు బాధ్యత లేకుండా తిరిగే ప్రభాకర్ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఇదీ చాలదన్నట్టు మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు.

మారతాడని.. కారు కొనిచ్చినా..

ప్రభాకర్ పెట్టే బాధలను పంటి బిగువున పద్మ భరించింది. పైగా పద్మను వేధించడం మొదలుపెట్టాడు. మారతాడేమనని కారు కొనిచ్చింది. కారును కిరాయిలకు తిప్పుతూ వచ్చిన నగదుతో జల్సాలు చేసేవాడు. పైగా పద్మను హింసించేవాడు. ఇటీవల అది శ్రుతిమించడంతో ప్రభాకర్‌ను నిలదీసింది. అయినప్పటికీ ప్రభాకర్ తన తీరు మార్చుకోలేదు. ఈక్రమంలో పద్మ తన పిల్లలతో కలిసి పుట్టింటికి ఇల్లెందు వచ్చింది. రెండు నెలలుగా ఇక్కడే ఉంటూ రోజూ విధి నిర్వహణ నిమిత్తం రోజూ ఖమ్మం వెళ్లివస్తోంది. భార్య తనను కాదని వెళ్లిపోవడంతో అక్కసు పెంచుకున్న ప్రభాకర్ గురువారం సాయంత్రం ఇల్లెందు కొలిమికొట్టం వద్ద ఖమ్మం నుంచి బస్సు దిగి ఇంటికి వెళ్తున్న పద్మను ప్రభాకర్ మరో ఇద్దరి స్నేహితుల సహాయంతో కిడ్నాప్ చేసి ఆటోలో తీసుకెళ్లాడు. ఆమె ఆరుస్తుండటంతో నోట్లో గుడ్డ ముక్కలు కుక్కారు. చున్నీని మెడకు బిగించి ఆటోలోనే హత్య చేశారు. చనిపోయిందని నిర్ధారించుకుని మృతదేహాన్ని మొట్లగూడెం మార్గంలోని చెట్లపొదల్లో పడేశారు. కొలిమికొట్టం వద్ద పద్మను ఆటోలో ప్రభాకర్ మరో ఇద్దరు బలవంతంగా ఎక్కిస్తున్నప్పుడు, ఆమె కాలి బూటు కిందపడింది. పైగా ఈ సంఘటనను చూసిన వారు పద్మ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈదిశగా పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేయడంతో భయపడిన ప్రభాకర్ పోలీసులకు శుక్రవారం లొంగిపోయాడు. అతడు చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు మొట్లగూడెం వద్ద పద్మ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతదేహం లభ్యమైన ప్రాంతాన్ని ఇల్లెందు డీఎస్పీ జీ.ప్రభాకర్‌రావు పరిశీలించారు. గురువారం రాత్రి గాలింపు చర్యల్లో పాల్గొన్న ఎస్ఐ కొమిరెల్లి నుంచి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. టేకులపల్లి పోలీస్ సీఐ దోమల రమేష్ దర్యాప్తు చేపట్టారు.



భర్తతో పద్మ(ఫైల్)





ఘటన ప్రదేశంలో పద్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్, ఆసుపత్రి వద్ద బంధువులు



విలపిస్తున్న పద్మ తల్లి

బోరున విలపించిన పిల్లలు, కన్నతల్లి

కూతురు పద్మను ఆమె భర్తే చంపాడంటూ వృద్ధురాలైనా పోశమ్మ విలపించారు. మృతురాలి కొడుకు జయేంద్ర, కూతురు రిషిక ఖమ్మంలోని ఒక ప్రవేట్ పాఠశాలలో 6, 5 తరగతులు చదువుతున్నారు. తండ్రి దురాగతానికి తల్లిని కోల్పోయిన చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తల్లి చనిపోగా, తండ్రి కటకటకాలపాలు కావడం, వృద్ధాప్యం పైబడిన అమ్మమ్మ సంరక్షణే ఆ చిన్నారులకు దిక్కయింది.

జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే పరామర్శ

మృతురాలు బండారి పద్మ తన జెడ్పీ కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తూ భర్త చేతిలో హత్యకు గురైనట్లు తెలియగానే జెడ్పీ చైర్‌పర్సన్ గడిపెల్లి కవిత, సీఈవో మారుపాక నాగేశ్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇతర సహోద్యోగులు ఇల్లెందుకు తరలి వచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పద్మను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక పోలీసులను కోరారు. భర్త ప్రభాకర్‌ను అతడికి సహకరించిన దుండగులను కఠినంగా శిక్షించాలని జడ్పీటీసీ చంద్ర అరుణ, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి నిర్మల, పీవైఎల్ జిల్లా కార్యదర్శి మోకాళ్ళ రమేష్ డిమాండ్ చేశారు. ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రిలో పద్మ కుటుంబాన్ని పరామర్శించారు.

నల్లబ్యాడ్జీలు ధరించి జడ్పీ ఉద్యోగుల నిరసన

ఖమ్మం కలెక్టరేట్, జనవరి5: బండారి పద్మ హత్య జడ్పీఉద్యోగుల్లో విషాదాన్ని నింపింది. గురువారం సాయంత్రం వరకు విధులు నిర్వహించిన పద్మ, శుక్రవారం ఉదయం తెల్లవారే సరికి హత్యకు గురైందన్న విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో టైపిస్ట్‌గా పనిచేసే పద్మ అందరితోనూ కలివిడిగా ఉండేవారు. శుక్రవారం ఉదయం సిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమలో జడ్పీచైర్‌పర్సన్ గడిపల్లి కవిత, జడ్పీ సీఈవో మారుపాక నాగేశ్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నడింపల్లి వెంకటపతిరాజు, మల్లెల రవీంద్రప్రసాద్, భానుమూర్తి, జడ్పీ పర్యవేక్షకులు పద్మావతి, శారదాదేవి, ఎంవీ రమణ, వీరబాబు,నేహ, రామకృష్ణారెడ్డి, వంశీకుమార్, రాజేష్ పాల్గొన్నారు.

గొడ్డలి తగిలి వ్యక్తి దుర్మరణం

వంట చెరుకు కోసం అడవికి వెళ్లగా ఘటన

పాల్వంచ రూరల్, జనవరి 5: గొడ్డలి తగిలి తీవ్ర గాయాలై ఓ వ్యక్తి మృతి చెందాడు. వంట చెరుకు కోసం అడవికి వెళ్లి కట్టెలు కొడుతుండగా శుక్రవారం ఈ ఘటన జరిగింది. పాండురంగాపురం గ్రామానికి చెందిన కోన వెంకటేశ్వర్లు(47) వంట చెరుకు కోసం నర్సంపేట సమీపంలోని అడవికి వెళ్లాడు. గొడ్డలితో కట్టెలు నరుకుతుండగా జారి మర్మఅవయవాలకు తగిలింది. దీంతో అక్కడిడక్కడే పడిపోవడంతో పక్కనే ఉన్న వాళ్లు గమనించారు. వెంకటేశ్వర్లును నర్సంపేట గ్రామానికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే రక్తస్రావం కావడంతో అక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతుడికి భార్య అచ్చెమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



వెంకటేశ్వర్లు మృతదేహం

ఆర్టీసీ డ్రైవర్ హఠాన్మరణం



ఖమ్మంసాంస్కృతికం, జనవరి5:ఆర్టీసీ ఖమ్మం డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎన్.నాగేశ్వరరావు (50) గురువారంరాత్రి ఖమ్మం డిపోలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం హైదరాబాద్ డ్యూటీకి వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో ఖమ్మండిపోనకు చేరుకున్నారు. కుమారుడు ఆయన్ను ఇంటికి తీసుకెళ్లడానికి వచ్చాడు. ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. ఆర్టీసీ డీఎం సూర్యనారాయణ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.ఎవీ గిరి సింహారావు, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతంతో సింగరేణి కార్మికుడి మృతి

ఇల్లెందుటౌన్,జనవరి5:విద్యుదాఘాతం కారణంగా సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం ఇల్లెందులో జరిగింది. జేకే కాలనీలోని కార్మిక ప్రాంతమైన కాలనీలో ఎస్డీ-288 క్వార్టర్‌లో గుగులోత్ రాందాస్(45) నివాసముం టున్నారు. ఆయన శుక్రవారం ఉదయం స్నానం చేసి, తడి కండువాను ఇనుప దండెంపై ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. భార్య మేరుబాయి వెంటనే సింగరేణి వైద్యశాలకు తరలించగా రాందాస్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. శుక్రవారం కావడంతో భద్రాచలం గుడికి వెళ్ళేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ దుర్ఘటన జరిగింది. రాందాస్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం చేయగా, కుమారుడు నంద్యాలలో ఐఏఎస్ కోచింగ్ పొందుతున్నాడు. కార్మికుడు మృతి తెలుసుకున్న సింగరేణి ఎస్వోటూ జీఎం మల్లేల సుబ్బారావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, కార్మిక సంఘం నాయకులు రంగనాథ్, జగన్నాథం వైద్యశాల వద్ద మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



రాందాస్ మృతదేహం

ప్రియుడిని చితకబాదిన ప్రియురాలు

- పోలీసులకు అప్పగింత
- నిందితుడు భద్రాచలం ఆర్టీసీ డిపోలో కండక్టర్

పాల్వంచరూరల్, జనవరి5: ప్రేమించాడు. ఆపై పెళ్లికి నిరాకరించాడు. దీంతో ప్రియురాలు ఆ ప్రబుద్ధుడ్ని చితకబాది, పోలీసులకు అప్పగించింది. ఈ సంఘటన శుక్రవారం పాల్వంచలో జరిగింది. పాల్వంచ మండలం దంతెలబోర గ్రామానికి చెందిన కౌవులోరి సమ్మక్కకు నాలుగేళ్ల క్రితం పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం మిట్టగూడెం గ్రామానికి చెందిన నాగరాజుతో వివాహం జరిగింది. ఆతర్వాత వీరిద్దరు విడిపోయారు. ఆ తర్వాత మిట్టగూడెం గ్రామాల్లోని గాడిద శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. వీరిమధ్య ప్రేమ చిగురించింది. శ్రీనివాస్ భద్రాచలం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుండేవాడు. ఆయన సమ్మక్కను పెళ్లిచేసుకుంటానని నమ్మించాడు. దంతెలబోరలోని సమ్మక్క తల్లిదండ్రులతో కూడా మాట్లాడినట్లు తెలిపారు. అనంతర క్రమంలో ఆమె గర్భందాల్చింది. పెళ్లి చేసుకోవాలని శ్రీనివాస్‌ను ఒత్తిడి చేశారు. దీనికి ఆయన అంగీకరించలేదు. దీంతో సమ్మక్క కుటుంబ సభ్యులు పాల్వంచ రూరల్ స్టేషన్‌లో డిసెంబర్ 18న ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్రీనివాస్‌ను పిలిపించి మందలించారు. ఆ తర్వాత నుంచి శ్రీనివాస్ కనిపించకుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ పాల్వంచలో ఆకస్మాత్తుగా మరో యువతితో తిరుగుతుండగా సమ్మక్క, వారి తల్లిదండ్రులకు కనిపించాడు. వారు శ్రీనివాస్‌ను పట్టుకొని చితకబాదారు. పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రియుడి చొక్కా పట్టుకుని ప్రశ్నిస్తున్న ప్రియురాలు సమ్మక్క

మందుబాబులకు రూ.25వేల జరిమానా

ఖమ్మం క్రైం, జనవరి 5: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందు బాబులకు కోర్టులో శుక్రవారం రూ.25వేల జరిమానా విధించారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఖమ్మంలో తనిఖీ చేపట్టగా పదిమంది దొరికారు. మద్యంసేవించి వాహనం నడుపుతున్నట్లు తేలటంతో వారిని కోర్టులో హాజరు పరిచారు. అనంతరం ట్రాఫిక్ ఏసీపీ సదానిరంజన్ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

పెళ్లికి అంగీకరించిన ప్రియుడి తల్లిదండ్రులు

ఆళ్లపల్లి,జనవరి5: ఆళ్లపల్లి మండలంలోని మైలారంలో ప్రేమించి పెళ్లికి నిరాకరించిన ఘటనలో కథకు తెరపడింది. మొన్న యువకుడు పెళ్లికి అంగీకరించాక, వారి తల్లితండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో శుక్రవారం ఆళ్లపల్లి ఎస్ఐ కుమారస్వామి,టేకులపల్లి సీఐ దోమల రమేష్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు దీంతో కథ సుఖాంతమైంది.

మనువాడతానని మోసం: ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్, జనవరి5 : దుమ్ముగూడెం మండలం అచ్యుతాపురానికి చెందిన కురసం బాబూరావుకు ఆరునెలల జైలు, రూ.10వేల జరిమానా విధించారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన కేసులో ప్రత్యేక మహిళా కోర్టు న్యాయమూర్తి ఎం.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. అనంతరం పెళ్లికి నిరాకరించాడు. దీంతో ఆమె దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 6,8,9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆస్పత్రులు, ఫార్మా, రెస్టారెంట్లు, రిక్రియేషన్ రంగాల వారు పై అధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి ప్రోత్సాహకరం. విందు, వినోదాల్లో ఉల్లాసంగా పాల్గొంటారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పొదుపు పథకాలు లాభిస్తాయి. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రియతములకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. బంధుమిత్రులతో సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): సమీక్షలకు అనుకూలం. గృహావసరాల కోసం అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక విషయాల్లో కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకర సమయం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వేడుకల్లో పాల్గొంటారు. శుభవార్త అందుకుంటారు. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. జన సంబంధాలు విస్తరిస్తాయి. స్టేషనరీ, ప్రింటింగ్, కమ్యూనికేషన్ల రంగాల వారికి శుభప్రదం. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): అదనపు ఆదాయం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అనుకూలం. సహోద్యోగుల ఆర్థిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, చిట్‌ఫండ్‌లలో పనిచేసే వారికి ప్రోత్సాహకరం.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సంతతి విషయాల్లో శుభప్రదం. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. చిట్‌ఫండ్‌లు, పొదుపు పథకాలు లాభిస్తాయి. చిన్నారుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు. దూరంలోఉన్న ప్రియతములు ఇల్లు చేరుతారు. వేడుకలు, బృంద కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తారు. రాజకీయ, సినీ రంగాల వారు కీలక పదవులు అందుకుంటారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): కొత్త స్నేహాలు చిగురిస్తాయి బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. సమావేశాలు, చర్చలు ఫలిస్తాయి. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రముఖుల్ని కలుసుకుంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. లక్ష్యం నెరవేరుతుంది. ప్రమోషన్లకు అనుకూలం.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. కొత్త వ్యూహాలు అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రవాణా రంగాల వారికి అనుకూలం. నూతన ప్రాజెక్టులను విజయవంతంగా చేపడతారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సంస్మరణలు, ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటారు. పూర్వ మిత్రులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. యోగ, ధ్యానాలపై దృష్టి పెడతారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): బృంద కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆలయ సమాచారం..



● భద్రాచలం రామయ్య

కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
కాటేజీలు	26	08
వందగదుల సదనం	62	43
శ్రీరామ సదనం	18	10
టీటీడీ సదనం	26	11
సౌమిత్రి సదనం	30	16

తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 వరకు, ఉదయం 7 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 8.30 వరకు సర్వదర్శనం.

సంప్రదించండి..
దేవస్థానం కేంద్రీయ విచారణ కార్యాలయం : 08743-232467, 7660007671

నిత్య సేవలు ఇలా..

- తెల్లవారుజామున 4.30కి సుప్రభాతసేవ.
- 5.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, నివేదన సేవాకాలం.
- ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సహస్రనామార్చన.
- 8.30 నుంచి 11.30 వరకు, 12.30 నుంచి 1గంట వరకు, 3 నుంచి 8 గంటల వరకు మూల వరుల వద్ద అర్చన.
- 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు నిత్య కల్యాణం.
- 11.30 నుంచి 12గంటల వరకు రాజభోగం.
- మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఆలయ తలుపులు మూస్తారు.
- రాత్రి 7గంటల నుంచి 8 వరకు దర్బారు సేవ.
- 8.30 నుంచి 9 గంటల వరకు నివేద బోగం అనంతరం పవళింపు సేవ. ఆ తర్వాత ఆలయం తలుపులు మూస్తారు.

ప్రత్యేక దర్శనం టిక్కెట్టు ధర ఒకటికి : రూ.20



● జమలాపురం వెంకన్న

కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
టీటీడీ సత్రం	12	00
సీహెచ్‌ఎన్‌ఎన్	10	06

నిత్య పూజలు

- *తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయాన్ని తెరుస్తారు.*
- *5గంటలకు తీర్థబిందెలు తెచ్చే కార్యక్రమం.*
- *6.30కి మంగళహారతి, మంత్రపుష్పం సమర్పణ.*
- *ఉదయం 7.00గంటలకు బాలభోగ నివేదన.*
- *7.10 నుంచి 12గంటల వరకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు.*
- *10.30 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం.*
- *సాయంత్రం 3గంటల నుంచి తిరిగి ఆర్జిత సేవలు.*

సంప్రదించాల్సిన నెం: 08749-279855 ● ఈవో రమణమూర్తి: 9491000705 ● ప్రధానార్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ : 9989507300

ఆటోస్టార్టర్లతో భూగర్భజలాలు వృథా

- స్వచ్ఛందంగా స్టార్టర్ల తొలగింపు
- అవగాహన కల్పిస్తున్న విద్యుత్, వ్యవసాయశాఖ, రైతుసమన్వయ సమితులు

ఖమ్మం కమాన్‌బజార్, జనవరి5: ఆటోస్టార్టర్లతో భూగర్భజలాలు వృథా అవుతాయి, తద్వారా నీటి ఎద్దడి ఏర్పడి తీవ్ర సంక్షోభానికి గురికావాల్సి వస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో పంటపొలాలు ఉన్నప్పటికీ ఆటోస్టార్టర్లతో పనిలేదని 24గంటల విద్యుత్ అందుబాటులో ఉన్నందున ఆటోస్టార్టర్లు అవసరం లేదని అధికారులు తేల్చిచెప్పారు. విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులు రైతు సమన్వయ సమితి సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పిస్తున్నారు. వారి సహకారంతో నేరుగా రైతుల దగ్గరకు వెళ్లి ఆటోస్టార్టర్లను తొలగిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖమ్మం డివిజన్‌లో 51,938 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా 13,595 ఆటోస్టార్టర్లు ఉన్నాయి. వాటిలో 2,781 ఆటోస్టార్టర్లను విద్యుత్ శాఖ అధికారులు తొలగించగా మిగితా 10,814 ఆటోస్టార్టర్లను స్వచ్ఛందంగా, రైతుసమన్వయసమితి సభ్యులతో తొలగిస్తున్నారు. సత్తుపల్లి డివిజన్‌లో 44, 649 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 15, 627 ఆటోస్టార్టర్లు ఉన్నాయి వాటిలో 3,099 ఆటోస్టార్టర్లను అధికారులు తొలగించారు. 12,528 ఆటోస్టార్టర్లను తొలగించాల్సి ఉంది. భద్రాచలం డివిజన్‌లో 11,471 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా 4,015 ఆటోస్టార్టర్లు ఉన్నాయి. వాటిలో 942 స్టార్లర్లను అధికారులు తొలగించారు. 3,073 ఆటోస్టార్టర్లను తొలగించాల్సి ఉంది. కొత్తగూడెం డివిజన్‌లో 21,546 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా 7,540 ఆటో స్టార్టర్లు ఉన్నాయి. వాటిలో 1,210 ఆటోస్టార్టర్లను అధికారులు తొలగించారు 6, 330 ఆటోస్టార్టర్లను తొలగించాల్సి ఉంది.



ఆటో స్టార్టర్లు తొలగిస్తున్న దృశ్యం(ఫైల్)

ఆటోస్టార్టర్లకు చెక్

వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో ఆటోస్టార్టర్లకు చెక్‌పడిందని అధికారులు అంటున్నారు. గతంలో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉంది. రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండటతో ఆసమయంలో రైతులు పంటపొలాలకు వెళ్లలేక ఆటోస్టార్టర్లను ఉపయోగించేవారు. లోవోల్టేజి, హైవోల్టేజి సమస్యలతో మోటార్లు కాలిపోయిన సందర్భాలు ఉన్నాయి.



ఆటోస్టార్టర్లతో పనిలేదు
కె. రమేష్, ఎన్పీడీసిఎల్, ఎస్ఈ

ఆటోస్టార్టర్లతో ఇక పనిలేదు.. వ్యవసాయానికి 24గంటలు విద్యుత్ అందుబాటులో ఉండటంతో రైతులే నేరుగా వెళ్లి మోటార్ ఆన్‌చేసుకోవచ్చు. ఆటోస్టార్టర్లు తొలగించకపోతే నీటి వృథాకావటమే కాదు, మోటార్లు కాలిపోయి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడతారు. వేరు వేరు ప్రాంతాల్లో పంట పొలాలు ఉన్నప్పటికీ రైతులు ఉదయం సాయంత్రం విడివిడిగా సాగుకు నీటిని ఉపయోగించుకోవచ్చు. గతంలో అలా లేకపోవటంతో ఇబ్బందులు పడ్డమాట వాస్తవమే. ప్రస్తుతం ఆ అవసరం లేదు



పంటల ధరలు (క్వింటాలుకు రూపాయల్లో)

పంట	కనిష్ఠం	గరిష్ఠం
పత్తి	4,000	5,1100
మిర్చి	5,500	8,775
మిర్చి (తాలు)	3,300	4,000
కందులు	3,300	4,040
పెసలు	1,800	4,250
మినుములు	-	-
మొక్కజొన్న	1,175	1,175
వేరుశనగ	3,900	4,700

నేడు ఖమ్మంలో అర్చక ఉద్యోగుల

రాష్ట్రస్థాయి సమావేశం

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 5: ఖమ్మంలో శనివారం అర్చక ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర స్థాయి అత్యవసర సమావేశం ఖమ్మంలో జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర నేతలు గంగు భానుమూర్తి, రంగారెడ్డి, రమేష్‌శర్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ముఖ్య నేతలంతా తప్పక హాజరుకావాలన్నారు. హైదరాబాద్ నల్లకుంటలో జరిగే సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, అందరూ ఖమ్మంలో జరిగే సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్'

ముత్యాల ముగ్గుల పోటీలు రేపు

పాల్వంచ, ఖమ్మంలో రెండు కేంద్రాల్లో నిర్వహణ

కొత్తగూడెం కలెక్టరేట్/ ఖమ్మం సాంస్కృతికం, జనవరి 5 : ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న టాటా జెమినీ టీ ముత్యాల ముగ్గుల పోటీలు... టేస్ట్ పార్టనర్ గోల్డ్ డ్రాప్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్, హెల్త్ పార్టనర్ అమృతబిందు.. ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం జరగనున్నాయి. ఇరుజిల్లాల్లో రెండు కేంద్రాల్లో ఈ పోటీలు జరుగుతాయి. భద్రాద్రి కొత్తగూడేనికి సంబంధించి పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో పోటీలు జరగనుండగా... అనుబోస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ సహకారం అందిస్తోంది. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ హైస్కూల్ ఆవరణలో జరిగే పోటీలకు ఖమ్మంలోని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ యాజమాన్యం సహకారం అందిస్తోంది. రెండు కేంద్రాల్లోనూ ఉదయం 9నుంచి 11గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఆసక్తి ఉన్న మహిళలు పేర్లునమోదు చేసుకునేందుకు భద్రాద్రి కొత్తగూడెం వారు 92469 07418, 99854 01698, ఖమ్మం జిల్లా వారు 99854 11349, 99854 10618 నెంబర్లలో సంప్రదించవచ్చు.

నిబంధనలు..

పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. చుక్కల ముగ్గులకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. వేసిన ముగ్గులు ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు చెప్పాల్సి ఉంటుంది. సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలి. తుది ఫలితంపై చర్చలకు తావులేదు.

అమెరికాకే నష్టం..

ఆచంట వెంకట మోహన్‌రావు, కొత్తగూడెం



హెచ్-1బీ వీసాలను పునరుద్ధరించకపోతే అమెరికా ప్రభుత్వానికిరూ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. మేధా సంపత్తి కలిగిన భారతీయులను అమెరికా వదులుకోదని నా అభిప్రాయం. ఈ ప్రతిపాదన గతంలో చేసినా.. ఇప్పటి వరకూ అమలు కాలేదు.

ట్రంప్ మాటలతో ఆందోళన

పి. రవిశంకర్, ఎంసీఏ బెంగళూరు



బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న నాకు కంపెనీ హెచ్1బీ వీసా కోసం ప్రపోజ్ చేసింది. ఉన్నత చదువులు చదువుకున్న మాలాంటి వారికి అమెరికా వెళ్లాలనే కోరిక ఉంటుంది. ఇప్పుడు అది నిరాశగానే మిగిలే అవకాశంఉంది.

నిర్ణయం వెనక్కు తీసుకోవాలి..

స్రవంతి, ఎంఎస్‌సీ, కొత్తగూడెం



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి, ఎంఎస్‌సీలను ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో చదువుకున్నాను. త్వరలో అమెరికాకు వెళ్లి ఉద్యోగం చేయాలని ఉంది. కానీ.. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తోచడం లేదు.

టెన్షన్ వద్దు అన్నారు..

బాగం వెంకటేశ్వరరావు, పాల్వంచ



నా కుమారులు హెచ్-1బీ వీసాపై నాలుగు సంవత్సరాలుగా అమెరికాలో పని చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయంపై వారితో మాట్లాడాను. అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. తిప్పి పంపినప్పుడు చూద్దాంలే అన్నారు.

అమెరికా తీరు కరివేపాకు చందం..

ఎంసీ. నాగిరెడ్డి, ప్రిన్సిపాల్, సాహితీ కాలేజీ, ఇల్లెందు



మా పిల్లలు దశాబ్ద కాలంగా అమెరికాలో ఉంటున్నారు. ఇండియాలోని ఐటీ నిపుణులను అమెరికా తన అవసరాలకు రప్పించుకొని.. నేడు కరివేపాకు మాదిరిగా తీసేసే చర్యలు చేపట్టడం సరైందికాదు. ట్రంప్ నిర్ణయాలు అమెరికా ప్రగతికి సైతం అవరోధమే. వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి.

సాంకేతికంగా ఎదగలేదు..

ఆర్ఎస్. శ్రీనివాస్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ఖమ్మం



భారతదేశం మేధోసంపన్న దేశం. మన విద్యార్థులు అమెరికాలో ఎప్పటి నుంచో ఉద్యోగం చేస్తున్నారు. భారతీయుల్ని కాదన్ని అమెరికా సాంకేతికంగా, ఆర్థికంగా ఎదగలేదు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఎక్కువ కాలం నిలవదు. ఈ నిర్ణయం వల్ల విద్యార్థుల్ని సాంకేతిక విద్యకు కూడా దూరమవుతున్నారు. రోజుకో నిబంధన వల్ల అమెరికా అంటేనే.. అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక దేశ అధ్యక్షుడు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం మంచికాదు.



కూలుతున్న ఆశల సౌధం..!



- ‘ట్రంప్ బూచీ’తో చెదురుతున్న అమెరికా కలలు
- హెచ్1బీ వీసాపై అధ్యక్షుడి నిర్ణయంతో ఇరు జిల్లాల వాసుల్లో సర్వత్రా ఆందోళన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - ఖమ్మం / కొత్తగూడెం)

అబ్బాయి, అమ్మాయిది త్వరలో ఇంజనీరింగ్ పూర్తవుతుంది. టోఫెల్, జీఆర్ఈ, ఐలెట్స్ ఏదో ఒకటి రాస్తారు. ఆ తర్వాత ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్తారు. ముందు పార్ట్‌టైం, చదువు తర్వాత ఫుల్‌టైం జాబ్. హెచ్1బీ వీసా వస్తే.. అక్కడే సెటిల్‌మెంట్. డాలర్ల సంపాదన. ఫ్యామిలీ మొత్తం ఆర్థికంగా సెట్ రైట్. ఇదీ.. జిల్లాలోని మధ్యతరగతి వర్గాలు నిర్మించుకుంటున్న ఆశల సౌధం. ఇందుకోసం ఎన్నో ఇబ్బందులుపడి పిల్లలను అమెరికా పంపిస్తుంటారు. ఈ కలలన్నింటిని అమెరికా అధ్యక్షుడు చెదరగొడుతున్నారు. హెచ్ 1 వీసా నిబంధనలు కఠినతరం చేస్తూ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో.. అమెరికా వెళ్లిన వారిలో, వెళ్లబోతున్న వారిలో సర్వత్రా ఆందోళ నెలకొంది. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులనూ కలవరం వెంటాడుతోంది.

ఉమ్మడి జిల్లా నుంచి అధికం..

తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే అత్యధికంగా ఎన్ఆర్ఐలు ఉన్నారు. అలాగే విదేశీ విద్య కోసం అమెరికా వెళ్తున్న వారి సంఖ్య కూడా పెద్దఎత్తున ఉంది. జిల్లా నుంచి సుమారు 40వేల మంది విదేశాల్లో ఉండగా.. ఇందులో 25వేల మంది చదువుల కోసమే వెళ్లిన వారు ఉన్నారు. ప్రతి ఏటా మూడు నుంచి ఐదు వేల మంది విద్యార్థులు ఉమ్మడి జిల్లా నుంచి అమెరికాకు వెళ్తున్నారు. పాస్‌పోర్టు కోసం 10-13 వేల మంది దరఖాస్తు చేస్తున్నారు. అమెరికాలో ఎంఎస్ చేసేందుకు కనీసం రూ. 25 లక్షల నుంచి 40 లక్షల వరకు ఖర్చు పెడుతున్నారు.

ఎన్నో కష్టాలు..

ఇంజనీరింగ్ చదువుతున్నప్పటి నుంచే చాలా మంది అమెరికాకు వెళ్లే ప్రయత్నాల్లో ఉంటున్నారు. ఇంజనీరింగ్ పూర్తికాగానే విదేశీ విద్యకు వెళ్లేందుకు పరీక్ష రాయడం, స్పోకెన్ ఇంగ్లీష్‌కు వెళ్లడం, వీసా కోసం దండయాత్ర చేయడం వంటివి ఎన్నో చేస్తుంటారు. అమెరికా వెళ్లిన తర్వాత యూనివర్సిటీల్లో, ఇతర చోట్ల కొందరు పార్ట్‌టైం ఉద్యోగాలతో ఎంతో కొంత సంపాదించి చదువు సాగిస్తున్నారు. ఆర్థింగా ఉన్నత కుటుంబాలకు చెందిన వారు మాత్రం ఇంటి వద్ద సొమ్ములతో చదువులు నడిపిస్తున్నారు. ఇలా రెండేళ్ల ఎంఎస్ పూర్తయిన తర్వాత ప్రైవేటు కన్సల్టెంట్ ద్వారా పలు కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరి సొమ్ములు సంపాదించుకుంటున్నారు. కొంతకాలం తర్వాత హెచ్ 1 వీసాలకు దరఖాస్తు చేసుకుని అక్కడే ఉద్యోగాలు నడిపిస్తున్నారు. ఇక లైఫ్‌కు ఢోకా లేదనుకున్న తర్వాత వివాహాలు చేసుకుని అక్కడే నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొంత మంది గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకుని అమెరికా సిటిజన్స్‌గా మారిపోతున్నారు.

ఈ నిర్ణయం ఎంతో ఉపయోగం..

జయశేఖర్ తాళ్లూరి, తానా ఎలెక్టెడ్ ప్రెసిడెంట్



హెచ్-1 వీసాలపై తీసుకుంటున్న నిర్ణయాలతో ఇబ్బందేమీ లేదు. ఈ నిబంధనల వల్ల ఉన్నతమైన చదువులు చదివి, అమెరికాలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇది ఎంతో ఉపయోగం. క్వాలిటీ పీపుల్స్‌ను తీసుకునేందుకే ఈ నిబంధన తెస్తున్నారు తప్ప, వేరే ఇబ్బంది ఉండదు. గత 17 సంవత్సరాలుగా అమెరికా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ.. ఎవరికీ ఇబ్బందులు తలెత్తలేదు. మీడియా ప్రచారం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. అపోహలకు గురవుతున్నవారి కోసం తానా, మరికొన్ని ఆర్గనైజేషన్ల ఆధ్వర్యంలో వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నాం.

అమెరికా కంటే..

జర్మనీ, ఇటలీలో అవకాశాలు అధికం

– కె.సరితారెడ్డి, విదేశీ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్



అమెరికా కంటే తక్కువ ఖర్చుతోనే జర్మనీ, ఇటలీలో విద్య, ఉద్యోగావకాశాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల ప్రజలు మొదటి నుంచి యుఎస్ వెళ్లడం ఆనవాయితీగా మారింది. ఇందుకోసం అధికంగా డబ్బు ఖర్చు చేస్తున్నారు. జర్మనీ, ఇటలీస్టేట్స్‌లో తక్కువ ఖర్చుతోనే.. బ్యాచిలర్ డిగ్రీతోపాటు ఐలెట్స్, టోఫెల్‌తో పనిలేకుండా సులభంగా వీసాలు పొందవచ్చు. జర్మనీలో మెకానికల్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఉన్నాయి. జర్మనీ 30 నుంచి 40 శాతం స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు కలిగిన యూనివర్సిటీలు జర్మనీ, కెనడాల్లోనే 17 ఉన్నాయి. ఇంగ్లీష్‌మీడియంలోనే విద్యాబోధన ఉంటుంది. ఫ్లైట్ ఛార్జీలు ఇతర ఫీజులు కలుపుకొని సుమారు 8.50 లక్షల వ్యయంతోనే ఎంఎస్ పూర్తిచేసుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడ కూడా పార్ట్‌టైం ఉద్యోగాలు ఉంటాయ. చదువు అనంతరం శాశ్వతంగా ఉద్యోగాలు పొందడంతోపాటు కుటుంబంతో స్థిరపడే అవకాశం కూడా ఉంది. ఇటలీలో కూడా ఇంగ్లీష్‌మీడియం బోధన ఉంటుంది. అక్కడి ప్రభుత్వం మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తుంది. ఫ్లైట్ చార్జీలు, ఫీజులు కలుపుకొని సుమారు 3.50 లక్షలతోనే ఎంఎస్ పూర్తిచేసుకోవచ్చు. జర్మనీ, ఇటలీ వెళ్లి చదువుకోవాలని భావించేవారు 8493879435, 9493878435 నెంబర్లలో సంప్రదించవచ్చు.

కల చెదరగొడుతున్న ట్రంప్..

ప్రస్తుతం ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికా కలను చెదరొగుడుతున్నాయి. హెచ్ 1 వీసాల మంజూరుపై కఠిన నిబంధనలు, అమెరికా పౌరులకే ఉద్యోగాలు వంటి నినాదాలు, నిర్ణయాలతో జిల్లా నుంచి అమెరికా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. లక్షలు ఖర్చు పెట్టి వెళ్లినా.. ఉద్యోగం గ్యారంటీ లేదన్న భయం అటు విద్యార్థులు, తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఇప్పటికే అమెరికా వెళ్లిన వారిలో చాలామంది ఆస్తులు, భూములు అమ్మి అప్పులు చేసిన వారు అధికంగానే ఉన్నారు. ఇప్పుడు అక్కడ ఉద్యోగాలు రాకపోతే మళ్లీ తిరిగి వచ్చి ఏం చేయాలి..? అన్న ఆందోళన అందరిలోనూ కన్పిస్తోంది. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అమెరికా కంటే జర్మనీ, ఇటలీ వంటి దేశాలు ఉన్నత చదువులకు, ఉద్యోగావకాశాలకు అనుకూలం అన్న వాదన తెరపైకి వస్తోంది. జిల్లా నుంచి వేలాదిగా అమెరికా వెళ్లిన యువత దృష్టి ఇతర దేశాలపై పడబోతోంది. జిల్లాలో వ్యవసాయ కుటుంబాలతోపాటు ఉద్యోగ, వ్యాపారవర్గాలు, సింగరేణి, కేటీపీఎస్, హెవీవాటర్ ప్రాజెక్ట్, నవభారత్ వంటి పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలు విదేశీ విద్యపై ఆసక్తి చూపుతూ ప్రతి ఏటా జిల్లా నుంచి అధికసంఖ్యలో వెళ్తున్నారు. ఈ ఏడాది కూడా వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే.. ప్రస్తుత పరిస్థితి అటు విద్యార్థుల్లో, ఇటు తల్లిదండ్రుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది.

అమెరికా ప్రయాణానికి సిద్ధంగా ఉన్నా..

కే. దీక్షిత్, బీటెక్ ఈఈఈ, చెన్నై



ప్రస్తుతం విదేశీ ప్రయాణానికి అన్ని సిద్ధంగా ఉన్నాయి. అమెరికాలో ఉద్యోగం చేయాలనేది నా కోరిక. హెచ్-1బీ వీసా రెన్యూవల్ చేయకూడదని, గ్రీన్‌కార్డు కొరకు నమోదు చేసుకున్న వారు ఎక్కువ భారతీయులే ఉన్నారని అమెరికా అధ్యక్షుడు అనడం హేయమైన చర్య.

యూఎస్‌లో ఎంఎస్ నా కల..

పి. లలిత్ వెంకటసాయి, బీటెక్ కంప్యూటర్ సైన్స్, కొత్తగూడెం



అగ్రరాజ్యమైన యూనైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో మాస్టర్ ఆఫ్ సైన్స్ లో పట్టాపొందాలనేది నా కల. హెచ్ 1వీసా రద్దు చేయాలని ట్రంప్ భావిస్తున్నట్లు వస్తున్న వార్తలతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాను. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

రెన్యూవల్ చేయాలి..

పసుపర్తి అనంతం, కొత్తగూడెం



ఏడాదికి 85వేల మంది ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్ కంపెనీలకు చెందిన వారే ఉంటున్నారు. ఈ కంపెనీల తరపున హెచ్-1బీవీసా కోసం దరఖాస్తులు నమోదు అవుతుంటాయి. కానీ.. ఇప్పుడు రద్దు వార్తల నేపథ్యంలో దాదాపు 7లక్షలమంది ఉద్యోగులపై ప్రభావం పడుతుంది.

అలాంటిదేమీ లేదు..

కాపా కృష్ణమోహన్, పాల్వంచ



నా కుమారుడు కృష్ణ చైతన్య ఎఫ్-1 వీసాపై టెక్సాస్ రాష్ట్రంలోని యూనివర్శిటిలో ఎంఎస్ చేశాడు. ఇప్పుడే అదే రాష్ట్రంలో ఐబీఎం సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. భారతీయులను వెనక్కి పంపించే సంకేతాలేమీ కనిపించట్లేదని మావాడు చెప్పాడు.

ఇబ్బందేమీ లేదు..

మొల్లేటి నగేష్, పాల్వంచ



నా కూతురు ఎఫ్-1 వీసాపై బెల్లి యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఆన్ ట్రైనింగ్ ప్రాక్టికల్స్‌లో ఉంది. ప్రస్తుతం అయితే.. అటువంటి ఇబ్బందేమీ అక్కడ లేదని తను ఫోన్ ద్వారా నాకు తెలిపింది. ట్రైనింగ్ పూర్తై.. జాబ్ వచ్చినా, రాకపోయినా ఇండియాకు వస్తుంది.

అమెరికా నిర్ణయం సరైంది కాదు..

బోయపాటి వెంకటేశ్వరరావు, టీచర్, మధిర



హెచ్1బీ వీసాల జారీపై అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులపై భారం పడనుంది. అమెరికాలో ఇటీవల ఎంఎస్ పూర్తిచేసిన నా కుమారుడు.. హెచ్1 కోసం దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నాడు. ఈ నిర్ణయంతో స్వదేశానికి వచ్చే పరిస్థితులు కన్పిస్తున్నాయి.

ట్రంప్ నిర్ణయంతో దిగ్భ్రాంతి చెందాం..

అడ్లూరి రమేష్‌బాబు, పేరెంట్, ఖమ్మం



ట్రంప్ నిర్ణయాల వల్ల కుటుంబమంతా దిగ్భ్రాంతికి గురయ్యాం. మాది మధ్య తరగతి కుటుంబం. మా అబ్బాయి నితీష్ భరద్వాజ్ ఎంఎస్ చదువుకుంటానని అమెరికా వెళ్లాడు. హెచ్1 వీసా కోసం అప్పు చేసి మరీ పంపించాం. అది ప్రాసెస్‌లో ఉంది. ఇలాంటి సమయంలో ట్రంప్ నిర్ణయం ఎంతో ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి.

ఆందోళన అవసరం లేదు..

బత్తినేని రాకేష్ వర్షినియా, ఐటీ పారిశ్రామిక వేత్త



హెచ్1బీ వీసాలపై వస్తున్న ప్రచారంపై ఆందోళన అవసరం లేదు. అమెరికా పార్లమెంటులో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు ఎగువ సభలో ఆమోదం పొందే అవకాశాలు చాలా తక్కువ. కాబట్టి, హెచ్1బీ వీసాలపై జరుగుతున్న ప్రచారాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. నైపుణ్యంగల విద్యార్థుల భవిష్యత్‌కు ఢోకా లేదు.

ఆందోళన చెందుతున్నాం


కళ్యం కోటిరెడ్డి, సింగరేణి కాలరీస్ ఉద్యోగి, ఇల్లెందు



గ్రీన్‌కార్డ్ ప్రాసెస్‌లో ఉన్నవారిని సైతం వెళ్ళిపోవాలని అమెరికాలో నోటీసులు జారీచేస్తున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మా కూతురు, అల్లుడు న్యూజెర్సీలో 11 ఏళ్లుగా ఉంటున్నారు. ఎన్నో అప్పులు చేసి అమెరికా వెళ్లినవారిని ఇలా పంపించేయాలని నిర్ణయించడం సరికాదు.

భారతీయుల భవిష్యత్ అగమ్యగోచరం

అన్నెం కావ్య, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యూఎస్ఏ



హెచ్-1బీ వీసాపై అమెరికాలో నివాసం ఉంటున్న వారిని వెనక్కి పంపాలంటూ అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రతిపాదన వల్ల ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న లక్ష మంది భారతీయుల భవిష్యత్ అగమ్యగోచరం మారనుంది. ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలి.

ఈ ఆలోచన సరి కాదు..

దారా కిరణ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యూఎస్ఏ



భారతీయ ఉద్యోగ నిపుణులను లక్ష్యంగా చేసుకుని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్-1బీ వీసా పొడిగించకూడదంటూ చేసిన ఆలోచన సరైంది కాదు. దీనివల్ల ఇప్పటికే.. అమెరికాలో వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న భారతీయులు అభద్రతాభావానికి గురవుతున్నారు.

ప్రపంచంలో ఎత్తయిన జలపాతం?




నూతిపల్లి బాలరాజ్
స్కూల్ అసిస్టెంట్

భూమి - ఆవరణాలు

1. 1492లో భారతదేశానికి చేరాలని బయలు దేరిన కొలంబస్‌ది ఏ దేశం?
   ఎ) స్పెయిన్ బి) పోర్చుగల్
   సి) ఇంగ్లండ్ డి) ఇటలీ
2. ఐరోపా నుంచి పశ్చిమ దిశగా బయలుదేరిన కొలంబస్ ఏ దీవులకు చేరుకున్నాడు?
   ఎ) ఇండోనేషియా బి) ఫిలిప్పీన్స్
   సి) కరేబియన్ డి) జపాన్
3. భూమి ఎటువైపు భ్రమణం చేస్తుంది?
   ఎ) పడమర నుంచి తూర్పునకు
   బి) తూర్పు నుంచి పడమరకు
   సి) ఉత్తరం నుంచి పశ్చిమానికి
   డి) దక్షిణం నుంచి ఉత్తరానికి
4. ఉత్తర, దక్షిణ ధృవాల ద్వారా భూమి మధ్యగా గీసిన ఊహా రేఖను ఏమంటారు?
   ఎ) కక్ష్య బి) అక్షం
   సి) భూ నాభి డి) భూమధ్య రేఖ
5. 180^0 తూర్పు, పశ్చిమ రేఖాంశానికి మరోపేరు?
   ఎ) గ్రినిచ్ రేఖాంశం బి) 0^0 రేఖాంశం
   సి) అంతర్జాతీయ దినరేఖ డి) భూమధ్య రేఖ
6. వీటిలో భూమిని సమాన అర్ధగోళాలు చేసేది?
   ఎ) గ్రినిచ్ రేఖ బి) భూమధ్య రేఖ
   సి) అంతర్జాతీయ దిన రేఖ డి) 0^0 రేఖాంశం
7. 'లాటిట్యూడో' అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
   ఎ) లాటిన్ బి) గ్రీక్
   సి) రోమన్ డి) అరబిక్
8. లాటిట్యూడ్ అంటే అర్థం?
   ఎ) పొడవు బి) నిలువు
   సి) దూరం డి) వెడల్పు
9. Hemisphereలో Hemi అంటే అర్థం?
   ఎ) అక్షాంశం బి) రేఖాంశం
   సి) సగభాగం డి) పావు భాగం
10. అక్షాంశాల్లో పొడవు అనే పదానికి సమాన అర్థం ఇచ్చే పదం?
   ఎ) లాటిట్యూడ్ బి) లాటిట్యూడో
   సి) లాంగిట్యూడ్ డి) మెరిడియన్
11. వీటిలో రేఖాంశాలకు సంబంధించి సరికానిది?
   ఎ) ఇవి పూర్తి వృత్తాలు కావు
   బి) ప్రతి రేఖాంశం ప్రతి అక్షాంశాన్ని ఛేదిస్తుంది
   సి) మొత్తం రేఖాంశాలు 180
   డి) లండన్‌లోని గ్రీన్‌విచ్ రేఖాంశాన్ని 0^0 రేఖాంశం అంటారు
12. వీటిలో అక్షాంశాలకు సంబంధించి సరికానిది?
   ఎ) ఇవి సమాంతర వృత్తాలు
   బి) ధృవాల వైపునకు వెళ్తున్న కొద్దీ చిన్నవిగా అవుతాయి
   సి) వీటి సంఖ్య 180
   డి) భూమధ్య రేఖకు ఉత్తర ధృవానికి మధ్య భాగాన్ని దక్షిణార్ధగోళం అంటారు
13. యాంటి మెరిడియన్ అంటే?
   ఎ) 180^0 రేఖాంశం బి) 90^0 అక్షాంశం
   సి) 60^0 అక్షాంశం డి) 0^0 రేఖాంశం
14. భూమి ఒక డిగ్రీ మేర కదలడానికి ఎంత సమయం పడుతుంది?
   ఎ) 15 ని. బి) 30ని. సి) 1ని. డి) 4ని
15. మధ్యాహ్న రేఖలు అని వేటిని అంటారు?
   ఎ) అక్షాంశాలు బి) రేఖాంశాలు
   సి) ఆయన రేఖలు డి) ధృవాలు
16. గ్రీనిచ్ కంటే భారత కాలమానం?
   ఎ) 5.30 గం. ముందు బి) 5.30 గంట వెనక
   సి) 3.30గం. ముందు డి) 3.30 గంట వెనక
17. సముద్ర ప్రవాహాలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రవహించడాన్ని ఏమంటారు?
   ఎ) పోటు పాటులు బి) ప్రవాహాలు
   సి) తరంగాలు డి) పైవేవీ కావు
18. సముద్ర ఉపరితల నీటి మట్టం హెచ్చు, తగ్గులను ఏమంటారు?
   ఎ) పోటు పాటు బి) ప్రవాహాలు
   సి) తరంగాలు డి) అలలు
19. సముద్రంలో నీటి మట్టం ప్రతి రోజూ పెరగడాన్ని, తగ్గడాన్ని ఏమంటారు?
   ఎ) పోటు పాటు బి) ప్రవాహాలు
   సి) తరంగాలు డి) అలలు
20. 'లితో' అంటే గ్రీక్ భాషలో అర్థం?
   ఎ) బంతి బి) రాయి సి) నీరు డి) ఆవిరి
21. 'అట్మాస్ఫియర్'లో అట్మాస్ అనే గ్రీక్ పదానికి అర్థం?
   ఎ) ప్రాణ వాయువు బి) నత్రజని
   సి) జీవం డి) నీటి ఆవిరి
22. మధ్యధరా సముద్ర దీప స్తంభం అని ఏ అగ్ని పర్వతాన్ని అంటారు?
   ఎ) మౌంట్ పీలే బి) ఫుజియమా
   సి) స్ట్రాంబోలి డి) ఏదీ కాదు
23. 'కిలిమంజారో' అగ్ని పర్వతం ఏ దేశంలో ఉంది?
   ఎ) జపాన్ బి) ఇటలీ
   సి) ఈక్వెడార్ డి) టాంజానియా
24. వీటిలో భారతదేశంలోని అగ్ని పర్వతం?
   ఎ) నార్కొండం బి) మౌంట్ వెసువియస్
   సి) మాయన్ డి) కోటోపాక్సి

టిఆర్‌టి - 2017

సోషల్ స్టడీస్ కంటెంట్



25. సజీవంగా ఉన్న 3/4వ వంతు అగ్ని పర్వతాలు ఏ మహా సముద్ర అంచున ఉన్నాయి?
   ఎ) హిందూ బి) అట్లాంటిక్
   సి) ఆర్కిటిక్ డి) పసిఫిక్
26. ఉష్ణోగ్రతల్లో మార్పుల వల్ల శిలలు బలహీనమై, పగిలిపోయే ప్రక్రియను ఏమంటారు?
   ఎ) క్రమక్షయం బి) రవాణా
   సి) శిలాశైథిల్యం డి) నిక్షేపణ
27. గాలి, నీటి శక్తుల కారణంగా భూమి ఉపరితలంపై పొరలు కొట్టుకుపోవడాన్ని ఏమంటారు?
   ఎ) క్రమక్షయం బి) రవాణా
   సి) శిలా శైథిల్యం డి) నిక్షేపణ
28. కొలొరాడో నది ప్రత్యేకత?
   ఎ) యూరప్‌లో అతి పెద్దనది
   బి) అతిపెద్ద జలపాతాన్ని కలిగి ఉంది
   సి) అతి పెద్ద అగాధ ధరిని కలిగి ఉంది
   డి) ఏడారి ప్రాంతంలో ప్రవహించేది
29. గోదావరి నదిపై బైసన్ గార్జ్ ఎక్కడుంది?
   ఎ) రాజమండ్రి బి) పాపికొండలు
   సి) బాసర డి) కందకుర్తి
30. నదులు V ఆకారం లోయను ఎక్కడ ఏర్పాటు చేస్తాయి?
   ఎ) పర్వత ప్రాంతాల్లో బి) మైదాన ప్రాంతాల్లో
   సి) సముద్ర తీరాల్లో డి) పైవేవీ కావు
31. ప్రపంచంలో ఎత్తయిన జలపాతం?
   ఎ) నయాగరా బి) ఎంజెల్
   సి) టుగెలా డి) జోగ్
32. ఎంజెల్ జలపాతం ఏ నదిపై ఉంది?
   ఎ) చురుణ్ బి) అమెజాన్
   సి) ఓల్గా డి) నైలు
33. భారతదేశంలో ఎత్తయిన జోగ్ జలపాతం ఏ నదిపై ఉంది?
   ఎ) మహానది బి) దామోదర్
   సి) శబర్మతి డి) శరావతి
34. వీటిలో ప్రపంచంలో అతిపెద్ద డెల్టాను కలిగి ఉన్న నది?
   ఎ) గంగా బి) సింధూ
   సి) గోదావరి డి) కృష్ణా
35. U ఆకారపు లోయలను ఏర్పాటు చేసేవి?
   ఎ) నదులు బి) సముద్రాలు
   సి) గాలులు డి) హిమానీ నదాలు
36. ట్రోపో ఆవరణం సగటు ఎత్తు ఎన్ని కి.మీ.?
   ఎ) 8 బి) 10 సి) 13) డి) 18
37. ట్రోపో ఆవరణం ఎత్తు ఎక్కువగా ఎక్కడ ఉంటుంది?
   ఎ) భూమధ్య రేఖ బి) ధృవాలు
   సి) ఆయన రేఖలు డి) పైవన్నీ
38. నీటి బిందువులు, బాష్పీభవనం, అవపాతం ఏ పొరలో కనిపిస్తాయి?
   ఎ) ట్రోపో బి) స్ట్రాటో సి) థర్మో డి) మిసో
39. అన్నిటి కంటే పైన ఉండే ఆవరణం?
   ఎ) స్ట్రాటో బి) మిసో సి) థర్మో డి) ఎక్సో
40. ఓజోన్ పొర ఏ ఆవరణంలో ఉంటుంది?
   ఎ) ట్రోపో బి) స్ట్రాటో సి) థర్మో డి) మిసో
41. అయానో ఆవరణం అని దేనికి పేరు?
   ఎ) మిసో బి) థర్మో సి) ఎక్సో డి) స్ట్రాటో
42. వీటిలో ఎత్తుకు వెళ్తున్న కొద్దీ ఉష్ణోగ్రత తగ్గే ఆవరణం?
   ఎ) స్ట్రాటో బి) మిసో సి) థర్మో డి) ట్రోపో
43. 'సాధారణ క్షీణతక్రమం' అంటే?
   ఎ) పైకి వెళ్తున్న కొద్దీ ఉష్ణోగ్రత తగ్గడం
   బి) వాతావరణ పీడనం క్రమంగా క్షీణించడం
   సి) గాలిలో నీటి ఆవిరి శాతం తగ్గడం
   డి) ఉష్ణోగ్రలు వేగంగా తగ్గడం
44. వీటిలో సమశీతోష్ణ మండలాల్లో వీచే పవనాలు?
   ఎ) వ్యాపార పవనలు బి) పశ్చిమ పవనాలు
   సి) ధృవ పవనాలు డి) ఆగ్నేయ పవనాలు
45. 'మౌసమ్' అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
   ఎ) హిందీ బి) గ్రీక్ సి) అరబిక్ డి) రోమన్
46. 'చినూడ్' అనే పదానికి అర్థం?
   ఎ) భారీ వర్షం బి) మంచును తినేది
   సి) మంచు తుపాను డి) వడగాలులు
47. ఆల్ప్సు పర్వతాల మీదుగా వీచే ఉష్ణ పవనం?
   ఎ) చినూక్ బి) ఫోన్ సి) లూ డి) ప్యూనా
48. భారతదేశంలో మే-జూన్ నెలల్లో వీచే పవనాలు?
   ఎ) పాంపెరొ బి) ప్యూనా సి) చినూక్ డి) లూ
49. బాగా ఎత్తులో ఉన్న మేఘాలను ఏమని పిలుస్తారు?
   ఎ) సిర్రస్ బి) క్యుములస్
   సి) నింబస్ డి) స్ట్రాటస్
50. ఒరోజెనిక్ వర్షపాతం అని దేనిని అంటారు?
   ఎ) సంవాహన వర్షపాతం బి) పర్వతీయ వర్షపాతం
   సి) చక్రవాత వర్షపాతం డి) పైవేవీ కావు
51. సైక్లోన్ అనే ఇంగ్లీష్ పదానికి మూలమైన గ్రీక్ పదం 'కైక్లోస్' అంటే అర్థం?
   ఎ) తుఫాను
   బి) చక్రీయ వర్షపాతం
   సి) తిరుగుతున్న
   డి) భారీ వర్షం
52. వాతావరణంలో అదృశ్యంగా ఉన్న నీటి ఆవిరిని ఏమంటారు?
   ఎ) ద్రవీభవనం
   బి) భాష్పీభవనం
   సి) ఆర్ద్రత
   డి) అవపాతం
53. అవపాతం ఏ రూపంలో ఉంటుంది?
   ఎ) వర్షం బి) మంచు
   సి) తుషారం, వడగండ్లు డి) పైవన్నీ
54. గాలి వేగాన్ని కొలిచే పరికరం?
   ఎ) హైగ్రో మీటర్ బి) అనిమో మీటర్
   సి) స్పీడో మీటర్ డి) భారమితి
55. ఆక్స్‌భౌ సరస్సులు వేటి ద్వారా ఏర్పడతాయి?
   ఎ) గాలి ప్రవాహాలు బి) క్రమక్షయం
   సి) నదీ ప్రవాహాలు డి) సముద్ర ప్రవాహాలు
56. జెట్ విమానాలు ఎగరడానికి అనుకూలమైన పొర?
   ఎ) ట్రోపో ఆవరణం బి) స్ట్రాటో ఆవరణం
   సి) మిసో ఆవరణం డి) థర్మో ఆవరణం
57. పశువులకిచ్చే ఔషధాల్లో డైక్లోఫినాక్‌ను వాడటం వల్ల అంతరించే స్థితికి చేరిన జాతి?
   ఎ) పిచుకలు బి) రాబందులు
   సి) చిరుతలు డి) పైవన్నీ
58. క్యోటో ప్రోటోకాల్ తీర్మానం చేసిన సంవత్సరం?
   ఎ) 1995 బి) 1997 సి) 2000 డి) 2002
59. క్యోటో ప్రోటోకాల్ ప్రకారం హరిత గృహ వాయువును ఎంత శాతం కంటే తక్కువ చేయాలని తీర్మానించారు?
   ఎ) 2 బి) 3.7 సి) 5.2 డి) 6.4
60. ఏ గడ్డి భూములను యురేషియాలో 'స్టెప్పీలు' అంటారు?
   ఎ) ఉష్ణమండల బి) సమశీతోష్ణ మండల
   సి) టండ్రా డి) పైవేవీ కావు

Answers

1) డి	13) ఎ	25)డి	37) ఎ	49) ఎ
2) సి	14) డి	26)సి	38) ఎ	50) బి
3) ఎ	15) బి	27)ఎ	39) డి	51) సి
4) బి	16) ఎ	28)సి	40) బి	52) సి
5) సి	17) బి	29)బి	41) బి	53) డి
6) బి	18) సి	30)ఎ	42) డి	54) బి
7) ఎ	19) ఎ	31) బి	43) ఎ	55) సి
8) డి	20) బి	32) ఎ	44) బి	56) బి
9) సి	21) డి	33) డి	45) సి	57) బి
10)సి	22) సి	34) ఎ	46) బి	58) బి
11) సి	23) డి	35) డి	47) బి	59) సి
12) డి	24) ఎ	36) సి	48) డి	60) బి

స్కాలర్‌షిప్స్

న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ & ట్రైనింగ్ స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తులు కోరుతోంది.

కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్-2018

స్కాలర్‌షిప్స్ సంఖ్య: 650

జనరల్ స్కాలర్‌షిప్స్: 375, ట్రెడిషనల్ ఆర్టిస్ట్ ఫ్యామిలీస్: 125, ట్రైబల్ కల్చర్/ ఎస్టీ స్టూడెంట్స్: 100, డిఫరెంట్లీ ఏబుల్డ్: 20, క్రియేటివ్ రైటింగ్/లిటరసీ ఆర్ట్స్: 30

స్కాలర్‌షిప్: సంవత్సరానికి రూ.3,600. ప్రత్యేక శిక్షణ ట్యూషన్ ఫీజుల కింద సంవత్సరానికి రూ.9,000 రీయింబర్స్ చేసుకోవచ్చు.

విభాగాలు: మ్యూజిక్, డాన్స్, డ్రామా, పెయింటింగ్, స్కల్పర్, క్రాఫ్ట్స్, లిటరరీ ఆర్ట్స్ ....

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ **చివరి తేదీ:** 2018 జనవరి 31

ఉచిత దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు: CCRT Regional Centre, Opp CII, New Google Office, Madhapur to Kondapur Main Road, Madhapur, Hyderabad - 500084

చిరునామా: Centre For Cultural Resources And Training, Plot No. 15 A, Sector - 7, Dwarka, New Delhi - 110075 **వెబ్‌సైట్:** www.ccrtindia.gov.in

ఫెలోషిప్స్

ఎన్‌ఐటి రూర్కెలా

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జూనియర్ రీసెర్చ్ ఫెలో భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

జూనియర్ రీసెర్చ్ ఫెలో: 01

అర్హత: ఎంటెక్/ఎంఇ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్)

ఫెలోషిప్: మొదటి రెండు సంవత్సరాలు రూ.25,000. చివరి సంవత్సరం రూ.28,000.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్

చివరి తేదీ: 2018 జనవరి 10

చిరునామా:
Asst. Registrar, SRICCE,
National Institute of Technology,
Rourkela–769 008

వెబ్‌సైట్:
http://nitrkl.ac.in/OldWebsite/Jobs_Tenders/5ProjectFellowships/Default.aspx

SSC CGL TIER-II *MODEL PAPER*

ENGLISH LANGUAGE AND COMPREHENSION

Directions (1-20): The first and the last parts of the sentence are numbered 1 & 6. The rest of the sentence is split into four parts and named R Q, R, and S. These four parts are not given in their proper order. Read the sentence and find out which of the four combinations is correct. Then find the correct answer and indicate it in the Answer Sheet.

1. 1. Today, the earth has many satellites besides the moon.
P. But the pull of the earth keeps them from doing so.
Q. The artificial satellites do not fall because they are going too fast to do so.
R. They are the artificial satellites made by man and very much smaller than the moon.
S. As they speed along, they tend to go straight off into space.
6. As a result, they travel in an orbit round the earth,
(A) QPSR (B) PRQS (C) SPQR (D) RQSP

2. 1. Love is one of the earliest of human passions.
P. It is also one of the sweetest.
Q. Love should be directed towards a worthy object.
R. But, like all strong passions it may, if not well regulated and controlled, lead us into misery.
S. Or it will prove in the end a source of bitterness.
6. Love, moreover, looks forward to reciprocation,
(A) RQPS (B) PRQS (C) PQSR (D) QRPS

3. 1. A rocket, burns a fuel that makes a great deal of gas at the back of the rocket.
P. Ordinary fuel will burn only in air, because it needs the oxygen in the air.
Q. A rocket can, therefore, travel outside the atmosphere in space where there is no air.
R. This gas pushes against the rocket and sends it forward.
S. However, rocket fuels have their oxygen in them and so they burn without air.
6. In fact, it will travel faster in space than in the air because the friction of the air is not there to slow it down.
(A) QSRP (B) RPSQ (C) SQRP (D) PRQS

4. 1. Some of the other patrons are even more of a problem than the theatre itself.
P.They make noises and create disturbances at their seats.
Q. Some act as if they were at home in their own living room watching the TV set.
R. People are often messy, so that you're constantly aware of all the food they're eating.
S. Many people in the theatre often show themselves to be inconsiderate.
6. People are also always moving around near you,creat ing a disturbance and interrupting your enjoyment of the movie.
(A) SPQR (B) PSRP (C) QRSP (D) RSQP

5. 1. A friend's rudeness is much more damaging than a stranger's.
P. You feel hurt instead of angry.
Q. You feel that you're being taken for granted
R. When a friend says sharply. "I don't have time to talk to you now."
S. When a friend shows up late for lunch or a shopping trip, with no good reason.
6. Friends, after all, are supposed to make up for the thoughtless cruel ties of strangers.
(A) RPSQ (B) PRSQ (C) SPQR (D) QSPR

6. 1. Even though
P. the movie 'Avatar'
Q. at the Box Office
R. is doing wonders
S. some depict the movie as
6. being racist.
(A) SRPQ (B) PRQS (C) QSPR (D) RSPQ

7. 1. The dollar has been
P. and markets
Q. weak for months
R. have been fretting
S. over a host of
6. potential economic worries.
(A) PQRS (B) SRPQ (C) QRPS (D) QPRS

8. 1. Miffed over the issue
P. of not being given
Q. Chetan Bhagat continues
R. to spew anger
S. credit for the film '3 Idiots'
6. through his blog.
(A) RSPQ (B) PSQR (C) SPQR (D) SRPQ

9. 1. The developer of
P. leading real estate
Q. one of the
R. is Emma properties
S. the Burj Dubai project
6. developers in Dubai.
(A) PQSR (B) QSRP (C) SRQP (D) PSRQ

10. 1. The agencies shall submit the bid documents
P. their technical bid
Q. along with definite
R. documentary proof of
S. eligibility criteria in
6. as clearly mentioned.
(A) QRSP (B) QPRS (C) SRPQ (D) PQSR

11. 1. The Indian hockey players
P. have refused
Q. the training camp
R. to attend
S. and have gone
6. on an indefinite strike.
(A) QPSR (B) SRPQ (C) PQRS (D) PRQS

12. 1. Though things are
P. slowly fading away
Q. looking a little brighter
R. and recession is
S. the job market still remains
6. a little volatile.
(A) SRPQ (B) QRPS (C) SPQR (D) PQSR

13. 1. Inherited $ 3000 but it was not sufficient to start a zoo.
P. I discovered that most dealers would cram twenty creatures into a cage.
Q. So I decided to become an animal collector for zoos.
R. If they survived, they increased the price of the survivors.
S. But it proved to be a short lived career.
6. My cages were spacious and the animals well looked after: so I lost all my money.
(A) SQPR (B) QPSR (C) QSPR (D) PQSR

14. 1. It was not the sort of prize one could carry home at short notice.
P. However, they could make an exception in my case.
Q. He pointed at a notice that winners had to remove their prizes immediately.
R. They agreed to keep the engine at the grounds for a few days.
S. So I asked the showman if he could help me to transport it.
6. Then I would have to make my own arrangements to take it out.
(A) RSQP (B) SQPR (C) PRSQ (D) QSRP

15. 1. One day at school, Newton was kicked by a bigger boy from a higher class.
P. He also decided to beat him at lessons, and this made him study harder.
Q. So he turned on the bigger boy and gave him a good beating.
R. The kicking made Newton very angry.
S. After that he improved in his studies.
6. Perhaps the big boy who kicked Newton did a service to the world.
(A) QRSP (B) SPRQ (C) RSPQ (D) RQPS

16. 1. Newton's head was so full of ideas that he was often quite lost in his thoughts.
P. For a long time his guests waited for him to return.
Q. Soon the wine, the dinner and the guests were all forgotten.
R. Once, when he was entertaining some guests, he went out of the room to fetch some wine.
S. On his way to the wine cellar he passed his work table.
6. They searched and found him hard at work in his study.
(A) SQRP (B) RSQP (C) QPSR (D) PSRQ

17. 1. Socrates
P. never to make
Q. a great Greek Philosopher
R. and had resolved
S. tried hard to control himself
6. a show of his temper.
(A) SRPQ (B) QSRP (C) QSPR (D) PQRS

18. 1. Most editors
P. set aside pages or columns
Q. of magazines and newspapers
R. on events of the day
S. for letters of comment
6. or on articles in the publication.
(A) PQRS (B) QPSR (C) QPRS (D) RPQS

19. 1. Life was
P. had a way of leaving
Q. interests that Ross
R. the work for his examinations
S. so full of other
6. to the last minute.
(A) PRQS (B) SQPR (C) RQSP (D) SRQP

20. 1. My aunt and mother
P. to buy sweet-sour candies
Q. just to get
R. give us money
S. rid of us
6. in the afternoon.
(A) PQRS (B) RPQS (C) QRPS (D) SRPQ

Directions (21-40): Find out which part of a sentence has an error and blacken the oval (⬬) corresponding to the appropriate letter (A, B, C). If a sentence is free from error, blacken the oval corresponding to (D) in the Answer Sheet.

21. Not only most of the popular tele-serials in India are illogical (A) / in their story line (B) / but also crude in their presentation. (C) / No error (D).
22. I am trying to convince my brother (A) / for the last two days to come (B) / and live with me till father's anger cools down. (C) / No error (D).
23. It is a pity that a son (A) / born from very good parents (B) / should live a life of misery and deprivation of the worst order. (C) / No error (D).
24. I would have asked my friend (A) / to leave my house at once(B) / if my father would not have been at home and awake. (C) / No error (D).
25. My friends Rishi and Sohan (A) / are very industrious and sincere (B) / but I like the latter most. (C) / No error (D).
26. At night, a galaxy of stars are seen in the sky (A) / but in the light of the sun (B) / we are unable to see them. (C) / No error (D).
27. Nothing but books were set on fire in the building (A)/and other things (B) / remained intact. (C)/No error (D).
28. Cannot you see that the gentry (A) / is objecting to loud music ? (B) / You cannot play loud music here. (C) / No error (D).
29. Sir, your responsibilities includes (A) / working with the editors on all aspects (B) / of the editorial process. (C) / No error (D).
30. Please never insist to go out alone (A) / or I will have to (B) /lock you in the room. (C) /No error (D).
31. Reformatory measures adopted by the government (A)/ indicate that 1991 marked (B) / the end of an era. (C) / No error (D).
32. While grouping the words (A) / care have been taken to include the role (B) /that grammar plays in a language. (C) / No error (D).
33. Between the years 2000 from 2003 (A) /I worked as (B)/ the centre head of a small institute. (C)/No error (D).
34. She dare not to go out in a dark night, (A) / because she is a very (B) / timid kind of creature. (C)/No error (D).
35. Distrust seems to be a factor (A) / borne out of (B) / prevailing circumstances. (C) / No error (D).
36. America is neither in favour of arms race (A) / or in favour of (B) / simple nuclear disarmament. (C) / No error (D).
37. Naturalisation is the (A) / process by which (B) / a immigrant becomes a citizen of his new country. (C) / No error (D).
38. A high fat diet not only increases the risks (A) / of heart ailments (B) / however also that of other disorders. (C) / No error (D).
39. When two vowel sounds occurs in direct succession, (A) / the transition between them (B) / is often difficult to make.(C) / No error (D).
40. The perquisites was paid to (A) / avoid the impasse altogether, (B) /and to facilitate smooth functioning of the organization. (C) / No error(D).

KEY						
		11. D	17. B	23. B	29. A	35. B
1. D	6. B	12. B	18. B	24. C	30. A	36. B
2. B	7. D	13. C	19. B	25. C	31. B	37. C
3. B	8. B	14. B	20. B	26. A	32. B	38. C
4. C	9. C	15. D	21. A	27. A	33. A	39. A
5. A	10. A	16. B	22. A	28. *	34. A	40. A

(*): 'are' in place of 'is' as genttry is plural noun. Change 'cannot' into 'can't'

పై ప్రశ్నపత్రాన్ని 'నంద్యాల అకాడమి' నిపుణుల బృందం రూపొందించింది.

(మిగతా రేపటి పేజీలో)

ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలు



అడ్మిషన్స్

ఆంధ్రప్రదేశ్‌లోని 164 ఆదర్శ పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2017-18 విద్యా సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు అర్హులు. ఆయా పాఠశాలల్లో 2016-17, 2017-18 సంవత్సరాల్లో నిరవధికంగా చదివి ఉండాలి.

వయసు: 01-09-2016 నుంచి 31-08-2008 మధ్య జన్మించివారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: ప్రవేశ పరీక్ష ద్వారా

ప్రవేశ పరీక్ష తేదీ: 2018 ఏప్రిల్ 8

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తు ప్రారంభం: 2018 జనవరి 16

చివరి తేదీ: 2018 ఫిబ్రవరి 16

వెబ్‌సైట్: http://cse.ap.gov.in/DSE/

అవీ..ఇవీ



అశ్వాపురంలో కాయకల్ప బృందం

8 ఆసుపత్రి సందర్శన, ఏర్పాట్లు, వసతులు వైద్యసేవల పరిశీలన

అశ్వాపురం జనవరి 5: అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌వో దయానందస్వామి నేతృత్వంలోని కాయకల్ప బృందం సందర్శించింది.ఈసందర్భంగా ఆరోగ్యకేంద్రంలో పరిశుభ్రత,రోగులకు అందుతున్న వైద్యం, పారిశుధ్యం నిర్వహణ, మందులు,వైద్యపరీక్షలు ఏవిధంగా నిర్వహిస్తున్నది పరిశీలించారు. ఆసుపత్రిలో ల్యాబ్,ఫార్మసీ విభాగాలను సందర్శించారు.ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. చంద్రుగొండ, యర్రగుంట, అశ్వాపురం,పర్ణశాల,మోరంపల్లిబంజర్, సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కాయకల్పలో 90శాతం నమోదు చేసుకోగా వాటిల్లో మెరుగైన కేంద్రాన్ని గుర్తించేందుకు అదనపు బృందం పర్యటిస్తోంది. కార్యక్రమంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డి,క్వాలిటీ మేనేజర్ శృతి, అశ్వాపురం వైద్యాధికారి బి.వీరబాబు సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం రహితంగా సాటివారిగూడెం

లక్ష్మీదేవిపల్లి, జనవరి 5: ఆరోగ్యాన్ని, ఆర్థికస్థితిని విచ్ఛిన్నంచేసే మద్యం మహమ్మారిని తమ గ్రామంలో దరిచేరనివ్వబోమని లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారి గూడెం గిరిజనులు శుక్రవారం ప్రతినబూనారు. ఈ మేరకు తహసీల్దారు సునీల్‌రెడ్డి, ఎస్సై ముత్యం రమేష్ సమక్షంలో సుమారు నలభై కుటుంబాలు ప్రమాణం చేశాయి. తమ గ్రామంలో మద్యం విక్రయించడం, తాగడం, తయారు చేయడం ఉండదని హామీఇచ్చారు. చాటుమార్గంలో తయారుచేసినా, విక్రయించినా, తాగినా అటువంటి వారికి రెండువేల రూపాయలు అపరాధ రుసుం వసూలు చేస్తామని, ఆ డబ్బును గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తామని అధికారుల సమక్షంలో స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు పాల్గొన్నారు.

గోదారమ్మ విలవిల..

8 జీవనదిలో కలుస్తున్న కోల్‌వాషరీ నీరు

8 బొగ్గునీటికి తోడవుతున్న చెత్తాచెదారం

8 పర్యావరణానికి పెనుముప్పు..

మణుగూరు రూరల్, జనవరి5: జీవనది గోదావరి వ్యర్థాలతో కలుషితమవుతోంది. ఓ పక్క సింగరేణికి సంబంధించిన కోల్‌వాషరీ నీరు.. మరో పక్క చెత్తచెదారంతో కూడిన మురుగు నీరు గోదావరి నదిలోకి నేరుగా వెళుతుండడంతో పవిత్రంగా భావించే నదీ జలాలు రంగు మారుతున్నాయి. అయినా అధికారులు మిన్నకుంటున్నారే తప్ప చర్యలకు ఉపక్రమించడంలేదు. తద్వారా భవిష్యత్‌లో గోదావరి నది నీరు తాగేందుకు భయపడాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. మణుగూరుకు మణిహారంగా ఉన్న సింగరేణి సంస్థ తమ కోల్‌వాషరీ ప్లాంట్ ద్వారా కొన్ని వేల లీటర్ల నీటిని సమీపంలోని కట్టువాగులోకి వదులుతోంది. ఆ నీరు నేరుగా సమీపంలోని నేరేళ్లకుంట చెరువు, గోదావరిలో కలుస్తోంది. అయితే ఈ నీటిని ఓ సారి పరిశీలిస్తే కోల్‌వాషరీ అనంతరం నీరు నల్లగా మారుతోంది. ఆ నీరే గోదావరిలో కలిసే చోట పూర్తిగా నలుపు రంగులో మారుతోంది. ఈ కలుషిత నీటికారణంగా జీవచరాలు అంతరించి పోవడంతోపాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలతో గోదావరిలో కలిసే ప్రాంతానికి ఎగువన కొద్ది దూరంలోనే మునిసిపాలిటీలో ఇంటింటికీ మంచినీటి పథకం, రూరల్ వాటర్ స్కీం ద్వారా మంచినీరు సరఫరా చేసేందుకు ఇన్‌టెక్ వెల్‌లను నిర్మించడంతో పాటు చినరావిగూడెం, అనంతారం, అన్నారం గ్రామాల పొలాలకు సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ కూడా ఉంది.

మల్లేపల్లి సమీపంలో సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన ఇన్‌టేక్‌వెల్ నుంచి తమ అవసరాలకు గోదావరి జలాలను వినియోగిస్తుండగా.. అవే జలాలను అవసరాలు తీరిన తరువాత వ్యర్థాల రూపంలో గోదావరిలో కలిసే వాగుల్లోకి వదులుతుండడం గమనార్హం.

స్లర్రీని నష్టపోతున్న సింగరేణి

గ్లోబల్ కోల్‌వాషరీ ప్లాంట్‌నుంచి బొగ్గును శుద్ధి చేసిన తర్వాత వచ్చేనీటిని కుంటలుగా ఏర్పాటు చేసిన స్లర్రీ పాయింట్లలో నిలువచేసి విడుదల చేయకపోవడంతో అటు సింగరేణి సంస్థ, ఇటు పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్లర్రీ పాయింట్లలో నిలువ ఉన్న కోల్ స్లర్రీని తిరిగి విక్రయిస్తే సంస్థకు లాభదాయకంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.



కోల్‌వాషరీ నీరు గోదావరిలో కలుస్తున్న దృశ్యం

దీనిపై ఏరియా జీఎం ఏమన్నారంటే...

కోల్‌వాషరీ నీటిని నిలువ చేసేందుకు స్లర్రీ పాయింట్ ఏర్పాటు చేశాం. స్లర్రీ పాయింట్‌కు తరలించిన అనంతరం అక్కడ తయారయ్యే స్లరీని విక్రయిస్తాం. ఆ తర్వాతే నీటని బయటకు వదులుతున్నాం. ఆ నీరు నేరుగా కాలువల ద్వారా గోదావరిలో కలిసే విషయం తెలీదు.. అధికారులను పంపించి పరిశీలన చేయిస్తాం..



మణుగూరులోని కోల్ వాషరీప్లాంట్



కట్టువాగులో కలుస్తున్న బొగ్గు నీరు



గోదావరిలో కలుస్తున్న కట్టువాగు

మన్యంలో ఉపరితల గనులొద్దు

8 ఆదివాసీల బతుకులు విచ్ఛిన్నం చేయొద్దు

8 అఖిలపక్ష సదస్సులో నాయకులు

8 ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న ఉపేందర్

గుండాల, జనవరి 5: మన్యంలో ఓసీలను తవ్వి ఆదివాసీల జీవితాలను విచ్ఛిన్నం చేయొద్దని, దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీలు, అన్ని పార్టీల నేతలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గుండాలలో ఓసీలకు వ్యతిరేకంగా అఖిలపక్షం ఆధ్వరంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడా రు. సీపీఎం నాయకుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ ఓసీలతో గ్రామాలను బొందలగడ్డగా మార్చేందుకు సీఎం కుట్రపన్నుతున్నారన్నారు. విధ్వంసకర అభివృద్ధిని అందరూ వ్యతిరేకించాలన్నారు. సీపీఐ నాయకుడు సాబీర్‌పాషా మాట్లాడుతూ ఓసీలతో తాగునీరు, సాగునీరు లభ్యం కాక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఎన్డీ నాయకుడు మధు మాట్లాడుతూ.. అభివృద్ధిని విస్మరించి ఓసీలను తవ్వితే సహించబోమన్నారు. కార్యక్రమంలో తోలెం సాంబయ్య (టీడీపీ), బొమ్మెర్ల శ్రీనివాస్(ఎమ్మార్పీఎస్), జవ్వాజీ లక్ష్మీనారాయణ(తుడుందెబ్బ)ఈసం పాపరావు, పోషం వెంకటేశ్వర్లు, దుర్గా(కాంగ్రెస్) ముక్తి సత్యం, కోరం సీతారాములు(ఎన్డీ), సర్పంచ్‌శాంతయ్య పాల్గొన్నారు.

సదస్సును అడ్డుకున్న పోలీసులు

కాగా సదస్సును గుండాల ఎస్సై శ్రావణ్‌కుమార్ అడ్డుకున్నారు. పార్టీల జెండాలను తొలగించారు. నిర్వహకులు 10 నిమిషాల్లో ముగిస్తామని హామీనిచ్చి సదస్సును నిర్వహించారు.

‘సీతారామ’ కాలువకు అటవీభూమి పరిశీలన

8 అటవీ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న కేంద్రబృందం సభ్యుడు సత్యన్

జూలూరుపాడు, జనవరి 5: సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణానికి అవసరమైన అటవీ భూమిని కేంద్ర బృందం సభ్యుడు, చెన్నైకు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి డి.సత్యన్ శుక్రవారం పరిశీలించారు. కారేపల్లి అటవీ రేంజ్ పరిధిలోని పాపకొల్లు అటవీ ప్రాంతంలో 29వ కంపార్టుమెంట్‌లో విస్తరించిన చీమలపాడు గుట్ట ప్రాంతంలో ఉన్న అటవీ భూమిని అటవీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కాలువ నిర్మాణానికి ఎంతమేర అటవీ భూమి కావలనే వివరాలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ భూములకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. కాలువ నిర్మాణంతో గుట్ట మధ్యలో ఎంతమేర టన్నల్(సొరంగం) చేపట్టాల్సి వస్తుందని ఆరా తీశారు. గుట్ట మధ్యలో నుంచి 1.9 కిలో మీటర్ల మేర సొరంగాన్ని చేపట్టాల్సి ఉందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణానికి ఫారెస్టు క్లియరెన్సు ఇచ్చే దానిలో భాగంగా స్టేజీ - 1, స్టేజీ -2, స్టేజీ-3లలో విడతల వారీగా భూమిని పరిశీలించి కేంద్రానికి సంబంధించి పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలకు నివేదికను అందిస్తామన్నారు. ఆ నివేదిక ఆధారంగానే అనుమతులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డీఎఫ్‌వో సునీల్ ఎస్ హెరామత్, ఎఫ్‌డీవో ప్రకాశ్, సీతారామ ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసచారి, డీఈ రాందాస్, ఏఈ పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యుడు సత్యన్

11న ట్రైకార్ రుణాల ఇంటర్వ్యూలు..

చంద్రుగొండ, జనవరి 5 : చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 11న మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మహాలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక లాటరీ పద్ధతిన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వీటి గతి ఇంతేనా..?

పట్టించుకోండి..

- రూ. లక్షలతో నిర్మించారు.. లక్షణంగా వదిలేశారు
- నిర్మాణం పూర్తయి పదేళ్లైనా వినియోగంలోకి రాని భవనాలు



ఆసుపాకలో అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి



వినాయకపురంలో కమ్యూనిటీహాలు దుస్థితి

అశ్వారావుపేట రూరల్, జనవరి 05: ఓ వైపు పక్కా భవనాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. ఇక్కడ చూడండి పరిస్థితి ఎలా ఉందో..?! డబ్బులు ఎక్కువగా ఉన్నాయని చేపట్టారో..? ఏమీ ఊసుపోక చేశారో కానీ.. పదేళ్ల క్రితం నిర్మించిన భవనాలు సైతం ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురావట్లేదు. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఈ భవనాలు.. ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఇలా.. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. మండలంలోని వినాయకపురం, బచ్చువారిగూడెం, తిరుమలకుంట, నారాయణపురం, అశ్వారావుపేటలో పదేళ్ల క్రితం నిర్మించిన భవనాలివి. ఏళ్లతరబడి వృథాగా ఉంటున్నా.. పట్టించుకుంటున్న నాథుడే లేడు. నారాయణపురంలో సహకార సంఘం ద్వారా నిర్మించిన గోదాం, పెదవాగు ప్రాజెక్టు, సున్నంబట్టిలో రూ.కోటివరకు వెచ్చించి నిర్మించిన భవనాలు సైతం నిరుపయోగంగానే ఉన్నాయి. ఆసుపాకలో ఎనిమిదేళ్ల క్రితం అంగన్‌వాడీ భవనం పక్కనే చేపట్టిన మరో భవన నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. పెంచికలపాడు పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించినా.. నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. అశ్వారావుపేట గిరిజన బాలుర వసతిగృహం, పెదవాగు ప్రాజెక్టు ఆశ్రమ పాఠశాలలో దాదాపు రూ.80లక్షలతో నిర్మిస్తున్న డైనింగ్ హాల్స్ అసంపూర్తిగానే ఉన్నాయి. కొత్తమామిళ్లవారిగూడెం కాలనీలో పాఠశాలను ఎత్తేయటంతో రూ.5లక్షలతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. ఇలా మండలవ్యాప్తంగా దాదాపు 40 భవనాలు వృథాగా ఉన్నాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించి, భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



అశ్వారావుపేట గిరిజన బాలుర హాస్టల్లో అసంపూర్తిగా డైనింగ్‌హాలు నిర్మాణం

పెన్నాడ శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే పరామర్శ

అశ్వారావుపేట టౌన్ జనవరి 5: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు పెన్నాడ శ్రీనువాసరావును ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. కాపులూరు గ్రామానికి శుక్రవారం చేరుకున్న తాటి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆత్మకమిటీ చైర్మన్ కెవి. సత్యనారాయణ, సర్పంచ్ మిద్దెన కొండయ్య, బిర్రం వెంకటేశ్వరరావు, బండారు శీనువాసరావు, పైడి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

టీఆర్ఎస్ నేత రామకృష్ణకూ...

దమ్మపేట, జనవరి 5: మండల పరిధిలో సుదాపల్లికి చెందిన టీఆర్ఎస్ నాయకుడు కోటగిరి రామకృష్ణ తండ్రి రామచంద్రారావు (75) గుండె పోటుతో మృతి చెందారు. ఆయన భౌతిక దేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించి, కుటుంబానికి సానుభూతి తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకటరావు ఫోన్‌లో రామకృష్ణను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పైడి వెంకటేశ్వరరావు, కే.వి.సత్యనారాయణ ఉన్నారు.

'కుల ఆధిపత్య నిర్మూలనే టీ-మాస్ లక్ష్యం'

చంద్రుగొండ, జనవరి 5: సమాజంలో కుల వర్గ ఆధిపత్యాన్ని నిర్మూలించడమే తమ లక్ష్యమని టీ-మాస్ జిల్లా కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. చంద్రుగొండలో జరిగిన మండల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అసమర్థత వల్లే టీ-మాస్ ఏర్పడిందన్నారు. రిజర్వేషన్ సమస్యలను ప్రశ్నించిన మంద కృష్ణ మాదిగను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఈ నెల 25న టీ-మాస్ ఆధ్వర్యంలో బహుజన డెమోక్రటిక్ లెఫ్ట్ ఏర్పడుతుందన్నారు. 17న అఖిల భారత కార్మిక సమ్మెకు టీ-మాస్ సంఘీభావం తెలియజేస్తుందని, గ్రామాల్లో జరిగే సర్వేకు కుల, ప్రజా సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు జానిమియా, రైతు సంఘం రామిరెడ్డి, శ్రీనివాసరావు, వేణు, మహిళా సంఘం నాయకురాలు జైతున్ బేగం, కేవీపీఎస్ నాయకులు రాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆటలు స్నేహాన్ని పెంచుతాయి: ఎమ్మెల్యే

దమ్మపేట, జనవరి 5: క్రీడలు స్నేహభావాన్ని పెంచుతాయని ట్రైకార్ చైర్మన్, ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని రాచూరుపల్లి గ్రామంలో శుక్రవారం అంతర్జిల్లా వాటీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. మూడు రోజులపాటు పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తాటి సూరిబాబు, తెల్లం రామారావులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు, పైడి వెంకటేశ్వరరావు, కే.వి.సత్యనారాయణ, వాసం శ్రీను, తిరువీదుల జేమ్స్ పాల్గొన్నారు.

ట్రైకార్ ఇంటర్వ్యూలు పూర్తి

ములకలపల్లి, జనవరి 5: ట్రైకార్ లబ్ధిదారులకు ఎంపీడీవో ధన్‌సింగ్ శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో 98 యూనిట్లకుగానూ.. 320 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 310మంది హాజరయ్యారని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక జాబితా ఈ నెల 12తేదీలోపు ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఎంపీపీ కుర్సం శాంతమ్మ, ఏటీడీవో లక్ష్మణ్‌బాబు, వైస్ ఎంపీపీ రమణ, ఏఎంసీ చైర్‌పర్సన్ తానం లక్ష్మీ, ఏపీజీవీబీ, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

మంద కృష్ణను విడుదల చేయాలని ఆందోళన

చంద్రుగొండ,జనవరి5: మందకృష్ణ మాదిగను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం చంద్రుగొండలో ఆందోళన చేశారు. మంద కృష్ణను అక్రమంగా అరెస్టు చేశారని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు సీహెచ్ వెంకటేశ్వర్లు, జి విజయ్, శేషగిరిరావు, కాంగ్రెస్ నాయకులు షాబీర్ హుస్సేన్, నర్సింహారావు, పకీర్ కుమార్, ప్రసాదు, సీపీఎం నాయకులు వి.శ్రీనివాసరావు, యాసా నరేష్, కేవీపీఎస్ రాయ్‌రాజా, భాస్కర్, టీడీపీ నాయకులు సత్యనారాయణ, వడ్డెర సంఘం నాయకుడు కన్నయ్య పాల్గొన్నారు.



చంద్రుగొండలో రాస్తారోకో దృశ్యం

ములకలపల్లి: మంద కృష్ణను విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో గంటా శ్రీనివాస్, గంటా వెంకటేశ్వర్లు, రాజు, వంశీ, నారాయణ, సాగర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములకలపల్లి, జనవరి 5 : విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ములకలపల్లి, జగన్నాథపురం, చాపరాలపల్లి పంచాయతీలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఏఈ సతీష్ కుమార్ తెలిపారు.

మరుగుదొడ్డి నిర్మాణం కనీస బాధ్యత

అశ్వారావుపేటరూరల్, జనవరి 05: ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవడం అనేది కనీస బాధ్యతగా ఉండాలని ఎంపీపీ బరగడ కృష్ణారావు సూచించారు. నారాయణపురం పంచాయతీలోని పండువారిగూడెంలో మరుగుదొడ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 23మందికి చెక్కులు పంపిణీ చేశారు. ఆయన వెంట కార్యదర్శి దొడ్డా ప్రసాద్ ఉన్నారు.

మెటీరియల్ పంపిణీ..

అన్నపురెడ్డిపల్లి, జనవరి5: మరుగుదొడ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు శుక్రవారం స్వచ్ఛభారత్ మిషన్ పథకంలో భాగంగా సర్పంచ్ రంగా సామగ్రి పంపిణీ చేశారు. స్లాబ్ లెవల్ వరకు నిర్మించుకున్న లబ్ధిదారులకు బేషిన్, రేకులు, ఒరలు, డోర్లు తదితర సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ కుమార్, టీఆర్ఎస్ నేత వెంకటేశ్వరరావు ఉన్నారు.

మిషన్ భగీరథ గుంతలో పడి..

అన్నపురెడ్డిపల్లి, జనవరి5: అన్నపురెడ్డిపల్లిలో తీసిన మిషన్ భగీరథ గుంతలో పడి మర్రిగూడెం గ్రామానికి చెందిన భట్టు రాములు కాలు జారిపడ్డారు. దీంతో ఆయన తలకు బలమైన గాయమైంది.

వీఆర్ఏ హంతకులను శిక్షించాలని నిరసన

ములకలపల్లి, జనవరి 5 : కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగాంకు చెందిన వీఆర్ఏ బోయిని సాయిలును ఇసుక మాఫియా హత్యచేయడం పట్ల ములకలపల్లి మండల వీఆర్ఏలు శుక్రవారం నిరసన వ్యక్తంచేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు కారుమంచి సత్యనారాయణ మాట్లాడుతూ... నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు కే. శ్రీను, ఎం. లక్ష్మీ, కే. శంకర్, లక్ష్మయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

పామాయిల్ తోట దగ్ధం

అశ్వారావుపేట టౌన్ జనవరి 5: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఒక పామాయిల్ తోట దగ్ధమైంది. మండలంలోని ఊట్లపల్లి సమీపంలో సువర్ణ సత్యనారాయణ అనే రైతుకు చెందిన పామాయిల్‌తోట సమీపంలో కొందరు వ్యక్తులు చెత్త తగలబెట్టారు. కొద్దిసేపటికే మంటలు పామాయిల్ తోటకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు. రూ.70వేల నష్టం జరిగినట్లు ఫైర్ ఆఫీసర్ సైదులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లో మంటలు

- కాలిపోయిన మోటార్లు
- ఆందోళనలో రైతులు

చంద్రుగొండ, జనవరి 5: మండలంలోని మంగయ్య బంజర్ గ్రామంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్ ఫార్మర్లలో మంటలు చెలరేగడంతో వాటి పరిధిలోని 10 వ్యవసాయ మోటార్లు కాలిపోయాయి. గ్రామ శివారులోని 63కేవీ ట్రాన్స్ ఫార్మర్, 16కేవీ ట్రాన్స్ ఫార్మర్లలో విద్యుత్ వైర్లు తెగి మంటలు చెలరేగాయి. దీంతో వీటి పరిధిలోని పలు విద్యుత్ మోటర్లు కాలిపోయ్యాయి. దీనివల్ల సుమారు లక్ష రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు బాణోతు బద్యా, మాలోతు చందు, ఆలు, భుక్యా లక్ష్మణ్, మాలోతు బోజ్యా నాయక్, సోమి, గుగులోతు కిషన్, ఉన్నం నర్సింహారావు, భుక్యా శ్రీను, బాణోతు బాలు తెలిపారు. సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకొని ట్రాన్స్ ఫార్మర్లను పునఃరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. చర్యలు చేపట్టామని ఏడీఈ హుస్సేన్ తెలిపారు.



కాలిపోయిన మోటార్ వద్ద రైతులు

బెల్లం.. బంగారం!

మణుగూరు రూరల్, జనవరి 5: బెల్లం మనజీవితంలో విడదీయరాని భాగం. వంటకాలు మొదలుకుని అజీర్తి నివారణ వరకూ విరివిగా వాడతాం. గుడుంబాను నిర్మూలించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ నిషేధం విధించాయి. మొదట్లో ఇది నల్లబెల్లానికి మాత్రమే పరిమితమైంది. కానీ ప్రస్తుతం తెల్లబెల్లంపై ఆంక్షలు విధించారు. ఇటీవల ఎక్సైజ్ శాఖాధికారులు కిరాణా వ్యాపారులతో సమావేశం నిర్వహించి అసలు అమ్మకూడదంటూ హుకుం జారీ చేశారు. వాస్తవానికి తెల్లబెల్లాన్ని కిలో పరిమాణంలో వ్యాపారులు అమ్ముతుంటారు. అలా కాకుండా చిన్నచిన్న ముక్కలుగా అమ్మాలని నిబంధనలు విధించారు. దీంతో విస్తుపోవడం వ్యాపారులవంతయ్యింది. వివిధ పూజా కార్యక్రమాలు, శుభకార్యాలకు బెల్లం తప్పనిసరి. ఇలాంటి తరుణంలో ఇటు ప్రభుత్వం, అటు ఎక్సైజ్ శాఖ అధికారులు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఏంటని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

పెద్దలను వదిలేసి..

జిల్లాలో దుమ్ముగూడెంలోని సుజ్ఞానపురం, చర్ల, కొత్తగూడెం, దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ గుడుంబా తయారవుతూనే ఉంది. ఓ వైపు నిషేధం విధించినా సారా ఎలా తయారవుతోందనేది సామాన్యులకు అంతుచిక్కని ప్రశ్న. దీనికి సమాధానం ఎక్సైజ్ శాఖాధికారులకు తెలుసు. తయారీదారులకు బెల్లం ఎక్కడి నుంచి వస్తుందో తెలుసు. కానీ తెలియనట్టు నటిస్తుంటారు. పైకి మాత్రం బెల్లం విక్రయాలు చేయొద్దంటూ హడావుడి చేస్తున్నారని వ్యాపారులు విమర్శిస్తున్నారు.

నగదు చెల్లించాలట?

ఫిబ్రవరిలో మేడారం సమ్మక్క సారక్క జాతర జరుగుతుంది. భక్తులు తమ మొక్కులను బెల్లం రూపంలో తీర్చుకుంటారు. తమ బరువు తగ్గ బంగారాన్ని అమ్మవార్ల సన్నిధిలో సమర్పిస్తారు. ఈసారి మాత్రం ఒక కిలో వరకు చిన్నచిన్న ముక్కలు కొనుగోలు చేసి మిగతాదంతా నగదు రూపంలో చెల్లించాలని ఎక్సైజ్ శాఖాధికారులు సూచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే అంతర్గత సమావేశాల్లో దీనిపై చర్చించినట్టు తెలుస్తోంది.

కామారెడ్డి నుంచి బంద్

సమక్క సారక్క జాతరకు కామారెడ్డి బెల్లంతోనే భక్తులు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఎందుకంటే జిల్లాకు కామారెడ్డి జిల్లా నుంచే బెల్లం వస్తుంది. జాతరకు లక్షల సంఖ్యలో పోటెత్తే భక్తులకు ఈసారి కామారెడ్డి బెల్లం దొరుకుతుందా? ఈ సందేహానికి కారణం... ఈ ఏడు కామారెడ్డి బెల్లం తయారీపై ప్రభుత్వం ఆంక్షలు విధించడమే! ఈ ఆంక్షలతో బెల్లం బంగారమైపోయింది. ఏటా నవంబరులో మొదలుపెట్టి ఫిబ్రవరి వరకు రైతులు బెల్లం తయారు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు! సీజన్ ఎప్పుడో మొదలైనా ఆంక్షల వల్ల బెల్లం తయారీకి రైతులు జంకుతున్నారు. కొందరు ధైర్యం చేసి వండినా వ్యాపారులు కొనడం లేదు. వందేళ్లుగా బెల్లం ఉత్పత్తికి కామారెడ్డి ప్రసిద్ధి చెందింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిసా రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేది. కొన్నేళ్లుగా నల్లబెల్లం పేరిట రైతులపై కేసులు పెడుతున్నారు. నల్ల బెల్లాన్ని సారా, గుడుంబా తయారీకి వినియోగిస్తున్నారన్న నెపంతో దాడులు చేస్తున్నారు. అయితే ఇది నల్ల బెల్లం కాదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే మూడేళ్లుగా కామారెడ్డిలో బెల్లం తయారీ, వ్యాపారం సన్నగిల్లింది. గతంలో జిల్లాకు 100 మంది బెల్లం వ్యాపారులు కామారెడ్డి మార్కెట్‌లో నుంచి ఎగుమతి చేసేవారు. ఇప్పుడు 11 మంది మాత్రమే ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో రోజుకు 185 పెట్టెల బెల్లం విక్రయాలు సాగుతాయి. పండుగ రోజుల్లో ఇది ఎక్కువగా ఉంటుంది. బెల్లం వినియోగంలో భద్రాచలం మొదటి స్థానంలో ఉంది. ఐదు కిలోల వరకూ ఎటువంటి ఆంక్షలు విధించడం లేదని ఎక్సైజ్ శాఖాధికారులు అంటున్నారు. అంతకుమించి కొనుగోలు చేస్తే ఆధార్ సహ పలు వివరాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొంతమంది వ్యాపారులపై నిఘా ఉంచారు. ఈ పరిణామాలతో వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. 'మేం ముప్పయి ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాం. ఎనాడూ ఇంత ఇబ్బందిపడలేదు. ఎక్సైజ్ శాఖాధికారులు మమ్మల్ని వేధిస్తున్నారు. అందుకే బెల్లం వ్యాపారానికి పూర్తిగా స్వస్తి పలికామని' పేరు రాసేందుకు ఇష్టపడని ఓ వ్యాపారి ఆంధ్రజ్యోతితో పేర్కొన్నాడు. మరోవైపు అధికారుల తీరు ఇలానే ఉంటే తాము మొక్కులు ఎలా తీర్చుకోవాలని మేడారం వెళ్లే భక్తులు ప్రశ్నిస్తున్నారు.

బెల్లం విక్రయాలపై ఎక్సైజ్ ఆంక్షలు...

ఎక్సైజ్‌శాఖ అధికారులు బెల్లం వ్యాపారస్థులపై జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 వరకు బైండోవర్ కేసులు నమోదు చేశారు. తహసీల్దార్‌ల ముందు హాజరుపర్చారు. ఆంక్షలను విధించారు. ఇందులో బాగంగా సారా తయారీకి ఎక్కువగా వినియోగించే నల్లబెల్లం అమ్మే వ్యాపారస్థులపై కేసుల నమోదు, పీడీ యాక్టులు పెడతామని హెచ్చరికలు జారీ చేశారు. లైసెన్స్ ఉన్నవారు కూడా బెల్లం విక్రయాలు చేయొద్దనే హెచ్చరికలు చేశారు. తెల్ల బెల్లం విక్రయాలకు కఠినమైన ఆంక్షలు విధించారు. తెల్ల బెల్లం ఐదుకేజీలకన్నా ఎక్కువగా విక్రయిస్తే కొన్నవారి పేర్లు వివరాలు తెలపాలని సూచిస్తున్నారు. ఒక వేల తెల్ల బెల్లం వినియోగించి సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో తెల్ల బెల్లాన్ని కూడా విక్రయించేందుకు వ్యాపారస్థులు ముందుకు రావడంలేదు. మార్కెట్లో బెల్లం కొరత అధికమవడంతో రూ.30లోపు ఉండే ధర ఏకంగా రూ.60, రూ.70లకు పెరిగింది. మేడారం జాతర సమయంలో తెల్లబెల్లానికున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఏకంగా రూ.100 పెంచి విక్రయిస్తూ వ్యాపారులు భక్తుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

తెల్ల బెల్లంతో సారా తయారీ ఖర్చుతో కూడుకున్నదే

నాటుసారా నల్లబెల్లంతోనే తయారుచేస్తుంటారు. నల్ల బెల్లం విరివిరిగా లభ్యమైన రోజుల్లో కేజీ రూ.10 వరకు ఉండేది. నాటుసారా నిషేధ చర్యలు ప్రారంభమైన తర్వాత కేజి రూ.20 వరకు పెరిగింది. నల్ల బెల్లంతో పోల్చితే తెల్ల బెల్లం ధర ఎప్పుడు ఎక్కువగా ఉంటుంది. రెట్టింపు ధర వెచ్చించి నాటుసారాను తయారుచేసేందుకు ఎవరూ ముందుకు రారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెల్ల బెల్లం విక్రయించే కొద్ది మందితో ఎక్సైజ్‌శాఖ కుమ్మక్కైందనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే కొద్ది మంది మాత్రమే ధైర్యం చేసి విక్రయాలు కొనసాగిసుండటం ఆరోపణలకు బలం చేకూర్చుతోంది.

ఆంక్షలు విధించలేదు
నర్సింహారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

బెల్లం వ్యాపారస్థులపై ఆంక్షలు లేవు. బెల్లం ఎక్కడి నుంచి తేచ్చేది, ఎవరికి విక్రయించేది ఎప్పటకప్పుడు సమాచారం ఇవ్వాలని కోరాం. ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేశాం. సారాను అరికట్టేందుకే నిబంధనలు విధించాం. దీన్ని అడ్డం పెట్టుకుని వ్యాపారస్థులు ధరలు పెంచి విక్రయించడమనేది సర్వసాధారణమే. మేడారం జాతరకు ఇంకా చాలా రోజులుంది. మేడారం భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎక్సైజ్ సిఐ, వ్యాపారస్థులు కలిసి ఓ నిర్ణయం తీసుకుంటారు. బెల్లం విక్రయించేలా చర్యలు తీసుకుంటారు.

జాతరకు వెసులు బాటునివ్వాలి
కొమరం పాపారావు, ముత్యాలమ్మనగర్



మేడారం సమ్మక్క-సారక్క జాతర పెద్ద పండుగ. ఈ జాతరలో ఏన్నో ఏళ్లుగా సమ్మక్క సారలమ్మలకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. బెల్లం సమర్పిస్తారు. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారానికి తెలంగాణ, ఆంధ్రరాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి భక్తులు లక్షల్లో హాజరవుతారు. జాతర సమయంలో ప్రభుత్వం బెల్లం విక్రయాలకు కొంత వెసులు బాటుకల్పించాలి.

నిబంధనలు విధించారు
నవీన్, వ్యాపారస్థుడు..



షాపులలో బెల్లం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ నిబంధనలు విధించింది. దీంతో కేజీ, అరకేజి అమ్మాలంటే ఇబ్బందిగా ఉంటోంది. ఇంత ఇబ్బందులుపడి బెల్లం విక్రయాలు చేయడం అవసరమా అనిపిస్తోంది. కొంతమంది వ్యాపారస్థులు బెల్లం విక్రయాలనే మానేశారు. నిబంధనలు లేకుంటే ఇలాంటి జాతర సమయాల్లో స్వేచ్ఛగా బెల్లం విక్రయాలు చేయొచ్చు. ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలి.

బెల్లంపై నిషేధం లేదు..
మణుగూరు ఎక్సైజ్ సీఐ రాంమూర్తి..



బెల్లం విక్రయాలపై నిషేధం విధించలేదు. కానీ విక్రయించేందుకు నిబంధనలు పాటించాలన్నాం. పదికేజీలకు మించి ఎవరు కొన్నా వివరాలు ఇవ్వాలని చెప్పాం. నాటు సారా నియంత్రణలో భాగంగానే నిబంధనలు విధించాం. మేడారం జాతరకోసం జాతర వద్ద బెల్లం(బంగారం) విక్రయించే పాయింట్లను ఏర్పాటు చేశాం. భక్తులు ఆ పాయింట్ల వద్ద బంగారాన్ని కొనుగోలు చేసుకోవచ్చు.



ఎక్సైజ్ ఆంక్షలతో వ్యాపారులు కిలో పరిమాణంలో బెల్లాన్ని విక్రయిస్తున్నారు

'ప్రధాన మంత్రి ఉపాధి కల్పన'కు
దరఖాస్తుల ఆహ్వానం

- 20 లోగా దరఖాస్తులు చేసుకోవాలి: డీఐవో అజయ్

కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 5: జిల్లాలో 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుద్యోగ, యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పరిశ్రమల అధికారి కే. అజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో జిల్లా పరిశ్రమల కేంద్రం, ఖాదీబోర్డు, ఖాదీ కమిషన్ ద్వారా పథకాన్ని అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. అర్హతగల నిరుద్యోగ యువతీ, యువకులు రూ.25లక్షల లోపు ఏదైనా తయారీ, రూ.10లక్షల లోపు సేవా రంగాల యూనిట్ల స్థాపనకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేయువారు ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, సంబంధిత ప్రాజెక్ట్ రిపోర్టు, గ్రామ జనాభా ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెల 20తేదీలోగా దరఖాస్తులను జిల్లా పరిశ్రమల కేంద్రానికి చేరేలా పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 96666 46223 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భద్రయ్యను కోర్టులో హాజరుపరచాలి: ఎన్డీ

ఇల్లెందు, జనవరి 5: న్యూడెమోక్రసీ(చంద్రన్నవర్గం) బయ్యారం దళకమాండర్ సూర్ణపాక భద్రయ్య అలియాస్ రాంబాబును వెంటనే కోర్టులో హాజరుపరచాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎస్‌కే.ముక్తార్‌పాషా డిమాండ్ చేశారు. ఇల్లెందులో శుక్రవారం విడుదల చేసిన పత్రికప్రకటనలో 45రోజుల క్రితం అనారోగ్యంతో బయ్యారం మండలం కోయగూడెంలో తన నివాసానికెళ్లి వైద్యచికిత్సలు పొందుతున్న రాంబాబును శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. రాంబాబు ప్రాణాలకు హానితలపెట్టకుండా కోర్టులో హాజరుపరచాలని ముక్తారపాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

మళ్లీ వణికిస్తున్న
చలి పులి

- భద్రాచలంలో 9.2డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత

భద్రాచలం, జనవరి 5: భద్రాచలం ఏజెన్సీని మళ్లీ చలి వణికిస్తోంది. రెండు రోజులుగా భద్రాచలంలో కనిష్ఠ ఉష్ణోగ్రత పది డిగ్రీల లోపు నమోదవుతోంది. గురువారం 9డిగ్రీలు, శుక్రవారం 9.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. దీంతో భద్రాచలం ఏజెన్సీలో చలి తీవ్రతకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత ఏడాది డిసెంబరు 16న 14 డిగ్రీలు, 17న 13.4 , 18న 13డిగ్రీలు, 19న 12.2డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. కాగా 20వ తేదీన 9 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు ఉష్ణోగ్రత పడిపోయింది. డిసెంబరు 21న సైతం పది డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అనంతరం క్రమేపి ఉష్ణోగ్రతలు పెరిగాయి. రెండు రోజులుగా చలి మళ్లీ తీవ్రతరమవుతోంది. దీంతో ఉదయం పది గంటలకు కూడా చలిగాలులు వీస్తుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. రాబోయే వారం వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో వృద్ధులు అస్వస్థతకు గురవుతున్నారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 5: జిల్లాలో దివ్యాంగులకు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి ఝాన్సీలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఉద్యోగ పోటీ పరీక్షల కోసం 40శాతం పైబడి సదరమ్ మెడికల్ సర్టిఫికెట్ కలిగిన వారు తెలంగాణ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ హైదరాబాద్ పేరిట దరఖాస్తు పంపాలని తెలిపారు. ఈ నెల 29తేదీలోగా అర్హతగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 99485 86757నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పంచాయతీలో నిధుల దుర్వినియోగం

- ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శులపై బదిలీ వేటు
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి

జూలూరుపాడు, జనవరి 5: మండలంలోని పాపకొల్లు పంచాయతీలో నిధులను ఖర్చు చేసినప్పటికి వాటికి సంబంధించిన క్యాష్, చెక్కు పుస్తకాల్లో వివరాలు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జూలూరుపాడు మండల ఈవోఆర్డీ, ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న బి.భారతి, పంచాయతీ కార్యదర్శులు ఎల్.శంకర్, యాకూబ్‌ఆలీని ఆకస్మికంగా బదిలీ చేశారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారిణి ఆశాలత బదిలీకి సంబంధించిన ఉత్తర్వులను వారికి పంపించినట్లు తెలిపారు.

నిధుల దుర్వినియోగం చేశారని ఫిర్యాదు

పాపకొల్లు పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేశారని కొంతమంది గ్రామస్తులు, వార్డు సభ్యులు గత కొన్ని నెలల క్రితం జిల్లా కలెక్టర్, డీపీవోకు పలు పర్యాయాలు ఫిర్యాదులు చేశారు. దీంతో సదరు అధికారులు విచారణ అధికారిని నియమించి విచారణ జరిపించారు. ఈ విచారణలో అప్పట్లో పాపకొల్లు పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శులుగా పని చేసిన మండల ఈవోఆర్డీ, ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బి.భారతి, పంచాయతీ కార్యదర్శులు ఎల్.శంకర్, యాకూబ్‌ఆలీ నిధులను ఖర్చు చేసినప్పటికి వాటి కి సంబంధించి చెక్కు, క్యాష్ పుస్తకాల్లో వివరాలు నమోదు చేయలేదని విచారణలో తేలింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను ఈవోఆర్డీ భారతిని మణుగూరుకు, పంచాయతీ కార్యదర్శులు ఇద్దరిని అశ్వారావుపేట మండలానికి బదిలీ చేశారు.



లైట్ అప్ 2018

ప్రపంచంలోనే అతి ఎత్తయిన బిల్డింగ్ బుర్జ్‌ఖలీఫా.. మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంది. 2018 నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతూనే గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది.

- బుర్జ్‌ఖలీఫా వేదికగా జరిగిన కొత్త సంవత్సర వేడుకల్లో 'లైట్ అండ్ సౌండ్ షో' పర్యాటకులకు వినోదం పంచింది.
- కొత్త సంవత్సరం అనగానే ఏ దేశంలో అయినా సాధారణంగా బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుతారు. దానికి భిన్నంగా యూఏఈ మాత్రం దుబాయ్‌లో అదిరిపోయే లైటింగ్‌షోను ఏర్పాటు చేసింది.
- కొత్త సంవత్సర వేడుక కోసం దుబాయ్‌లోని బుర్జ్‌ఖలీఫా వద్ద యూఏఈ ఏర్పాటు చేసిన లైటింగ్ అండ్ సౌండ్‌షోకు అనేక ప్రత్యేకతలున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)స్థాపకులు షేక్ జాయేద్ బిన్‌కు నివాళిగా ఈ లైట్ అండ్ సౌండ్ షోను ఏర్పాటు చేశారు. 2018 సంవత్సరాన్ని 'ఇయర్ ఆఫ్ జాయెద్'గా యూఏఈ ప్రకటించింది.
- ఇది ప్రపంచంలోనే అతిపెద్ద లైట్ అండ్ సౌండ్ షోగా గిన్నిస్ రికార్డులకెక్కింది.

ఈ షోకు 'లైట్అప్ 2018' అని పేరు పెట్టారు. ఈ షోను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ఐదు నెలల ముందు నుంచే సన్నాహాలు ప్రారంభించారు. మొత్తం 300 మంది నిపుణులు అన్ని రోజుల పాటు పరిశ్రమించి అద్భుతమైన లైటింగ్ దృశ్యాలను ఆవిష్కరించారు.

- ✧ లైట్అప్‌షోకు అవసరమైన వస్తువులను వివిధ దేశాల నుంచి తెప్పించారు.
- ✧ 7 కి. మీ. పొడవైన విద్యుత్ వైర్లను, 25 కి. మీ. పొడవైన తాళ్లను వాడారు.
- ✧ నేపథ్య సంగీతాన్ని దుబాయ్, కైరోల్లోని స్టూడియోల్లో రికార్డు చేశారు.
- ✧ 80 మంది సంగీత కళాకారులు పాల్గొన్నారు.

- బుర్జ్ ఖలీఫా బిల్డింగ్ మొత్తానికి లైట్‌షోతో ఏర్పాటు చేశారు.
- ఇది విస్తీర్ణంలో 20 ఫుట్‌బాల్ మైదానాలంత (సుమారు 27 ఎకరాలు) ఉంటుంది.
- ఇంతకు ముందు ఈ రికార్డు చైనాలోని ఐసీసీ బిల్డింగ్ పేరు మీద ఉంది.

నోరు తిరుగుతోందా?




How much wood, would a woodchuck chuck if a woodchuk, could chuck wood?

పొడుపు కథ

కాళ్లు లేవు గానీ నడుస్తుంది. కళ్లు లేవు గానీ ఏడుస్తుంది. ఏమిటది?



పజిల్ పూరించండి



పద్యం

నిండునదులు పారు నిలిచి గంభీరమై
వెర్రివాగు పారు వేగఁబొర్లి
అల్పుడాడురీతి నధికుండు నాడునా?
విశ్వదాభిరామ వినురవేమ.

భావం : సెలయేరు వేగంగా ప్రవహించి అన్నింటినీ ధ్వంసం చేసినట్టే జ్ఞానం లేని వాడు ఆవేశంతో అన్ని పనులూ చెడగొడతాడు. వివేకవంతుడు నిండు నది వలె పనులు సక్రమంగా పూర్తి చేస్తాడు.

జంతర్ మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ణపయంరి ▶..............
2. భవంవై ▶..............
3. శ్చితానిర్థం ▶..............
4. ధుబంత్రులుమి ▶..............
5. కరాపోలుక ▶..............

ఆణిముత్యం

ఒర్పు అనేది ఎంత చేదుగా ఉంటుందో, దానివల్ల లభించే ప్రతిఫలం అంత తియ్యగా ఉంటుంది.



జంబ్లింగ్ వర్డ్స్



1. LICPOE ________
2. IRF ________
3. RICME ________
4. MMCOISIONRE ________
5. SPINEORCT ________

జతపరచండి

ఈ ప్రముఖులనూ, వారి స్మారక స్థలాలనూ జతపరచండి

1. మహాత్మాగాంధీ	ఎ. శక్తిస్థల్
2. జవహర్‌లాల్‌నెహ్రూ	బి. విజయ్‌ఘాట్
3. లాల్‌బహదూర్ శాస్త్రి	సి. రాజ్‌ఘాట్
4. ఇందిరాగాంధీ	డి. శాంతివనం
5. బాబూ జగ్జీవన్‌రామ్	ఇ. చైత్రభూమి
6. బి.ఆర్. అంబేద్కర్	ఎఫ్. సమతాస్థల్

పదాలు కనుక్కోండి

shoe, duck, doll, globe, block, green


x	k	c	o	l	b
l	n	e	e	r	g
l	g	l	o	b	e
o	q	n	c	w	c
d	n	s	h	o	e
u	w	k	c	u	d

దారి కనుక్కోండి



ఒకటికి మూడు

చిత్రంలో కనిపిస్తున్న వాటిని తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఏమంటారంటే..!



1. కుక్క
2. DOG
3. कुत्ता

నీడలు గుర్తించండి



జవాబులు

పజిల్ పూరించండి : 17 (కనుక్కోవాల్సిన సంఖ్య ఎదురుగా ఉన్న రెండు అంకెలను కూడాలి 9+8=17), జతపరచండి: 1 సి, 2 డి, 3 బి, 4 ఎ, 5 ఎఫ్, 6 ఇ. జంబ్లింగ్ వర్డ్స్ : 1. POLICE, 2. FIR, 3. CRIME, 4. COMMISSIONER , 5. INSPECTOR, పొడుపు కథ : మేఘం, జంతర్‌మంతర్ : 1. పరిణయం, 2. వైభవం, 3. నిశ్చితార్థం, 4. బంధుమిత్రులు, 5. రాకపోకలు

నేడు ఇరుజిల్లాల్లో మంత్రి పర్యటన

- సీఎంవో ప్రత్యేకాధికారి స్మితాసబర్వాల్, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి కూడా...
- భగీరథ పనుల పరిశీలన

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం కలెక్టరేట్/అశ్వాపురం, జనవరి 5: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయనతోపాటు మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, సీఎంవో ప్రత్యేకాధికారి స్మితా సబర్వాల్ ఉదయం 7గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి హెలిక్యాప్టర్ ద్వారా నేరుగా మణుగూరు చేరుకుంటారు. అక్కడ 8:30కి రథంగుట్టపై మిషన్‌భగీరథ ఇన్‌టేక్ వెల్‌ను సందర్శిస్తారు. మంత్రి తుమ్మల మణుగూరు నుంచి 10:15కి మరిపెడ గురుకులానికి చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుమలాయపాలెం మండలం మాదిరిపురానికి 11గంటలకు చేరుకుంటారు. అక్కడ నీటిశుద్ధికేంద్రాన్ని పరిశీలించి మిషన్ భగీరథ పనులపై మంత్రి తుమ్మల సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2:15కు కరీంనగర్ తిమ్మాపూర్ చేరుకుంటారు. అక్కడ 3 గంటలకు తిమ్మాపూర్ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు వెళ్తారు.





సీఎంవో ప్రత్యేకాధికారి స్మితా సబర్వాల్ అశ్వాపురం మండల పరిధిలోని కుమ్మరిగూడెం వద్ద ఇన్‌టేక్‌వెల్, సంపుల నిర్మాణాలు పరిశీలించిన అనంతరం మిట్టగూడెం రథంగుట్ట వద్ద సంబంధిత అధికారులతో పథకం తీరు తెన్నులపై సమీక్ష నిర్వహించనున్నారు. సమీక్ష అనంతరం 10గంటలకు మహబూబాబాద్ జిల్లాకు వెళ్లనున్నారు. వీరి పర్యటనను మిషన్‌భగీరథ డీఈ ఏసుబాబు ధ్రువీకరించారు.

రామాలయంలో పడమర ముఖ ద్వారానికి

ఇత్తడి కవచం పనులు షురూ

- రూ.21 లక్షలతో 500 కిలోలు వినియోగం
- శ్రీరామనవమి నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు

భద్రాచలం, జనవరి 5: భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి ప్రధాన ఆలయంలోని పడమర ముఖద్వారానికి ఇత్తడి కవచం పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భద్రాచలానికి చెందిన శ్రీచక్రా సిమెంట్స్ ఎండీ నేండ్రగంటి కృష్ణమోహన్ రూ.21 లక్షలను ఇత్తడి కవచం ఏర్పాటుకు విరాళంగా అందజేశారు. ఈ పనులు శ్రీరామనవమి నాటికి పూర్తయ్యేలా చేపడుతున్నారు. ఈ పనుల ప్రారంభ కార్యక్రమంలో దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం డీఈ వి.రవీంద్రనాథ్, ఈవో సీసీ అనిల్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తగూడెం

సుదర్శనాచారి కథ సుఖాంతం

పాల్వంచ టౌన్, జనవరి 5: కొడుకు గెంటేశాడని పాల్వంచ-గట్టాయిగూడెంలోని తన నివాసం ఎదుట గురువారం నిరసనకు దిగిన వృద్ధ దంపతులు పమ్మి సుదర్శనాచారి, స్వరాజ్య లక్ష్మీ దంపతుల కథ సుఖాంతమైంది. గురువారం రాత్రి సీఐ రాఘవేంద్రరావు స్థానిక కులపెద్దల సమక్షంలో మాట్లాడారు. సుదర్శనాచారి ఇంటిని కుమారుడు పమ్మి సతీష్ 19లోపు ఖాళీచేసి తల్లిదండ్రులకు అప్పగించేందుకు అంగీకరించారని సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 5: కొత్తగూడెం పట్టణంలోని 33/11కేవీ లైన్‌ల కిందగల చెట్ల కొమ్మల నిర్మూలన నేపథ్యంలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడుతుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ముహమ్మద్ రహీహుల్ హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూలీలైన్, పాతకొత్తగూడెం, బూడిదగడ్డ, గాజులరాజం బస్తీ, ఎంజీరోడ్డు, రామవరం, గరిమెళ్లపాడు, రుద్రంపూర్, ఎ-పవర్ హౌస్ బస్తీ, సీతంపేట, రాఘవాపురం, నిమ్మలగూడెం, కోమటిపల్లి, నాయకులగూడెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సదుద్దేశ్యంతో తమకు సహకరించాలని కోరారు.

పాల్వంచలో..

పాల్వంచ టౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం పట్టణంలోని నవభారత్, సంజయ్‌నగర్, పాలకోయతండా, మంచికంటినగర్, శేఖరంబంజర, సోనియానగర్, ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడుతుందని విద్యుత్ ఏఈ బి. నరేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు

విద్యార్థుల జీవితాలతో చెలగాటం: సంధ్య

పాల్వంచరూరల్, జనవరి 5: విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సంధ్య ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పి. ప్రేమ్‌కుమార్, కె.హనుమాన్, నాగేశ్వరరావు, వైష్ణవి, చందు, పవన్, పి.ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

'పల్లెప్రగతి'పై మహిళలకు అవగాహన

జూలూరుపాడు, జనవరి5: తెలంగాణ పల్లె ప్రగతి పథకంపై మహిళలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం జూలూరుపాడులో స్వయం సహాయ సంఘం సభ్యులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ మండల ఏపీఎం సత్యనారాయణరాజు మాట్లాడారు. మహిళా రైతులకు చేయూతనందించేందుకు పల్లె ప్రగతి పథకాన్ని ప్రవేశ పెట్టారని, ఈ పథకంలో స్వయం సహాయక సంఘాలలోని మహిళలు ఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేసుకుంటే వారికి తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తారన్నారు. ఆకు కూరల సాగు, పశువుల, గొర్రెల పెంపకాలకు గాను ప్రభుత్వం రుణాన్ని అందించడంతో పాటు, ఉద్యాన, వ్యవసాయశాఖల ద్వారా సబ్సిడీపై పరికరాలను అందిస్తుందన్నారు. డ్వాక్రా మహిళలు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకొని బ్యాంకుల్లో ఖాతాలను తెరవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీసీ దారావత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూములు ఆక్రమించారని ఆందోళన

- గిరిజనేతరుల సేద్యాన్ని అడ్డుకున్న ఆదివాసీలు
- సమన్వయ పరిచిన అధికారులు
- తహసీల్దార్ హామీతో విరమణ

లక్ష్మీదేవిపల్లి, జనవరి 5: తమ భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారంటూ లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం ఆదివాసీలు ఆందోళనకు దిగారు. గిరిజనేతరులు సేద్యం చేస్తుండగా శుక్రవారం ఆదివాసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో నాట్లను ధ్వంసం చేయడంతో ఆ ప్రాంతంలో గిరిజన, గిరిజనేతరుల మధ్య వివాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న తహసీల్దారు సునీల్‌రెడ్డి, ఎస్సై రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీంతో గిరిజనులు సర్వేనెంబర్ 48లో తమకు ప్రభుత్వం భూములు కేటాయిస్తూ హక్కు పత్రాలు ఇచ్చారనీ, భూమిని మాత్రం తమకు చూపలేదన్నారు. ఆ భూములనే గిరిజనేతరులు ఆక్రమించుకుని సేద్యం చేయడానికి ఉపక్రమించడంతో అడ్డుకున్నామన్నారు. దీంతో స్పందించిన తహసీల్దార్ భూములను సర్వే చేయించి అప్పగించే వరకు సేద్యం చేయవద్దని ఆదేశించారు. హక్కుపత్రాల ప్రకారం భూములను పంటతో సహా అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఆదివాసులకు చాతకొండ సర్పంచ్ పడిగ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య అండగా నిలిచారు.




ఆదివాసీలతో మాట్లాడుతున్న తహసీల్దారు, ఎస్సై

కాంగ్రెస్ మైనార్టీ సెల్ కమిటీ నియామకం



జానీపాషా
అధ్యక్షుడు



హైమద్
ఉపాధ్యక్షుడు

కొత్తగూడెంకలెక్టరేట్, జనవరి 5: కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ కొత్తగూడెం పట్టణాధ్యక్షుడిగా షేక్ జానిపాషా, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ హైమద్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు ఆసంఘం ఖమ్మం జిల్లా చైర్మన్ ముహమ్మద్ బాబా తాజుద్దీన్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలను, పార్టీ ప్రతిష్ఠకు పాటుపడతామని, ముస్లిం మైనార్టీ వర్గాల ఉన్నతికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని హామీనిచ్చారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, భట్టీ విక్రమార్క, ఖాజా ఫక్రుద్దీన్, ఐతా సత్యం నాయకత్వాన్ని బలపరిచి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి

- మెప్మా ఆధ్వర్యంలో ప్రదర్శన

కొత్తగూడెం టౌన్, జనవరి 5: మునిసిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షన్-2018 ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఇందిర మాట్లాడారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ నిర్మాణంలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ జిల్లా ఏడీఎంపీ పి. చంద్రశేఖర్‌బాబు, టీఎంసీ జి. నాగయ్య, మీరా బాయి,మిట్టపల్లి కల్పన, లక్ష్మీ, రజనీ, లక్ష్మి పాల్గొన్నారు.



స్వచ్ఛసర్వేక్షన్ ర్యాలీ

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచ రూరల్, జనవరి 5: పాల్వంచ- పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మ వారికి శుక్రవారం పంచామృతాలతో వైభవంగా అభిషేకం చేశారు. మేళతాళాలతో అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి అభిషేకం చేసి హారతి సమర్పించి మూల విరాట్ పంచామృతాల అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ కోడి వెంకటేశ్వర్లు, సభ్యులు పోతురాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జెన్కో సీఎండీకి '1535' నేతల శుభాకాంక్షలు

కేటీపీఎస్(పాల్వంచ),జనవరి5: తెలంగాణ జెన్కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావుకు కేంద్రప్రభుత్వ ప్రతిష్టాత్మక సీపీఐబీ అవార్డు లభించిన నేపథ్యంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శుక్రవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎ వజీర్ నేతృత్వంలో పలువురు నాయకులు సీఎండీకి పుష్పగుచ్ఛాలు అందజేశారు. తెలంగాణ లో రైతులకు, పరిశ్రమలు, గృహవినియోగానికి నిరంతరాయంగా విద్యుత్‌ను అందించటం అసాధారణమని ప్రభాకర్‌రావు సారథ్యంలోనే జెన్కో ఉన్నత శిఖరాలకు చేరుతుందని వజీర్ పేర్కొన్నారు. సీఎండీని కలిసిన వారిలో సంఘ రాష్ట్ర సహాయకార్యదర్శి సయ్యద్ సులేమాన్, పలువురు మహిళా కార్మికులు పాల్గొన్నట్టు తెలిపారు.



సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

సినిమాలు

కొత్తగూడెం

- దుర్గా: ఎంసీఏ
- పూర్ణ: ఏ పిల్లగాడ..
- పరమేశ్వరి: ఒక్కక్షణం
- విశ్వరూప: టూ కంట్రీస్
- మహేశ్వరి: హలో

పాల్వంచ

- వెంకటేశ్వర ఎంసీఏ
- వేణుగోపాల్ ఒక్క క్షణం..
- శాంతి టూ కంట్రీస్

ప్రధాన ఆసుపత్రి

సూపరింటెండెంట్
డాక్టర్ జనార్దన్ 8008553195
శనివారం డ్యూటీ డాక్టర్
మాలతి క్రిష్టిన

గ్యాస్ సమాచారం

కొత్తగూడెం ఇండియన్ గ్యాస్ గోడౌన్ నుంచి 5న గ్యాస్ బుక్ చేసుకున్న వారికి 12 న సిలిండర్ అందజేస్తారు.
గ్యాస్ ఆన్‌లైన్ బుకింగ్
9848824365

రైతు బజార్ ధరలు

కిలో, రూపాయల్లో..
టమోట-15,పచ్చిమిర్చి-30,వంకాయ-20, బెండకాయ-35, కాకరకాయ-40,బోడ కాకరకాయ-60, బీరకాయ-50, దొండకాయ-30, చిక్కుళ్ల కాయలు-50, దోసకాయ-25, మసాల వంకాయ- 25, సోరకాయ ఒకటి రూ.15, పొట్లకాయ ఒక్కటి రూ.15, క్యాబేజీ-40, ఉల్లిగడ్డలు (రైతుబజారులో) రూ. 50, గోరుచిక్కుళ్లు - 35, చామగడ్డ-50, అలుగడ్డ- 20, క్యారెట్ - 60, క్యాప్సికమ్-70, తెల్ల వంకాయ-30,కంచ కాకర రూ.50, తోటకూర-5, కోతిమీర, పుదినాకట్ట ఒక్కటి10,పాలకూరకట్ట-5,చుక్కకూరకట్ట -5,బచ్చల కూరకట్ట-5,అరటికాయ-8

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఎముకల దృఢత్వ శిబిరం

కొత్తగూడెం సాంస్కృతికం, జనవరి5: రక్తదానం, కృత్రిమ అవయవదానాలు, ఎముకల దృఢత్వపరీక్షలు వంటి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న రోటరీక్లబ్ నిర్వాహ కులు అభినందనీయులని మునిసిపల్ చైర్‌పర్సన్ పులిగీత అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన ఎముకల దృఢత్వ పరీక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పేదల అభ్యున్నతి కోసం రోటరీక్లబ్ చేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ అబ్రహం మాట్లాడుతూ రెండురోజులు నిర్వహించే ఈ పరీక్షల ద్వార ఎముకల దృఢత్వానికి అవసరమైన వైద్య సేవలు పొందడానికి అవకాశముందన్నారు.

అవీ..ఇవీ..



మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపు

సుజాతనగర్, జనవరి 5: సుజాతనగర్ పంచాయతీ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న 35 మందికి సర్పంచ్ వేములపల్లి సత్యనారాయణ చెక్కుల రూపంలో బిల్లులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలన ధ్యేయంగా సాగుతున్న కృషికి అందరూ సహకరించాలన్నారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అందరు ఆరోగ్యపరిరక్షణకు మరుగుదొడ్ల నిర్మించుకుని పంచాయతీని బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హరికృష్ణా, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు సదరమ్ శిబిరం

కొత్తగూడెంకలెక్టరేట్, జనవరి 5: కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం నిర్వహించే సదరమ్ క్యాంపును దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు సతీష్ కోరారు. శుక్రవారం ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదరమ్ సర్టిఫికెట్లు లేని అభ్యర్థులు, సర్టిఫికెట్లలో తప్పులు దొర్లిన అభ్యర్థులు సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. అన్ని మండలాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను కోరారు.

జానపద కళాకారులకు బీమా కార్డులు

పాల్వంచ టౌన్, జనవరి 5: జిల్లా జానపద కళాకారుల సంఘం తరపున జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులకు ఇన్సూరెన్స్ కార్డులను పంపిణీ చేసినట్లు జిల్లా సంఘం అధ్యక్షులు సిద్దెల హుసేన్ శుక్రవారం తెలిపారు. గురువారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్, స్వామిగౌడ్, ప్రభుత్వ సలహాదారు రమణాచారి చేతుల మీదుగా 63మందికి కార్డుల పంపిణీ చేశారన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో చెత్తకుప్ప



పాపకొల్లు పంచాయతీలో బూజు పట్టిన కంప్యూటర్

పట్టించుకోండి..

అంటుకుంటే బుగ్గే..

పాల్వంచ టౌన్, జనవరి 6: పాల్వంచ-ఎన్టీఆర్ వీధి టెలిఫోన్ ఎక్ఛేంజ్ వెనుక వైపు గేటు వద్ద పేరుకుపోయిన చెత్తకుప్పతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రానున్నది వేసవి కావడంతో పొరపాటున చెత్తకుప్పపై నిప్పు పడితే.. పరిసరాలు బుగ్గయ్యే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. సమీపంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, పక్కనే బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఏదైన అగ్గిరవ్వపడితే ఆ చెత్త అంటుకుని పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అంటుకుని భారీ ప్రమాదం జరిగే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

నిర్లక్ష్యానికి బూజు..

జూలూరుపాడు, జనవరి 6: ఈ-సేవలను అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ సంకల్పానికి నిర్లక్ష్యపు బూజుపడుతోంది. ఈ సేవలు అందించడం కోసం జూలూరుపాడు, గుండెపుడి, కాకర్ల, పడమటనర్సాపురం, మాచినేనిపేటతండా, మాచినేనిపేట, కొమ్ముగూడెం, బేతాళపాడు, పాపకొల్లు, కరివారిగూడెం, అనంతారం పంచాయతీలకు అందించిన కంప్యూటరర్లు, ప్రింటర్లు నిరుపయోగంగా ఉన్నాయి. పలు పంచాయతీ కార్యాలయాల్లో అవి బూజు పట్టి అలంకారప్రాయమయ్యాయి. వీటిని ఎప్పుడు వినియోగంలోకి తెస్తారో కూడా అధికారులు స్పష్టం చేయడం లేదు.

ఏడోదశలో కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు

కేటీపీఎస్(పాల్వంచ), జనవరి5: పాల్వంచ-కేటీపీఎస్ ఏడోదశ నిర్మాణంలో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. ఒక ప్రమాదంలో బీహార్‌కు చెందిన వలస కార్మికుడు తీవ్ర గాయాలపాలుకాగా మరో చోట తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఏడోదశ బాయిలర్ వద్ద ఐడీ ఫ్యాన్ల వెల్డింగు పనుల్లో భాగంగా డెక్ ఎరక్షన్ చేస్తుండగా 20మీటర్ల ఎత్తునుంచి బీహార్‌కు చెందిన కాంట్రాక్టు కార్మికుడు జారిపడటంతో కాళ్లు విరిగిపోయాయి. క్షతగాత్రుడ్ని భద్రాచలం వైద్యశాలకు తరలించారు. స్థానికంగా కన్వేయర్ టీపీ9 వద్ద 15టన్నుల బరువుతో వించు మిషన్ వద్ద సిమెంటు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు వించుమిషన్ వెల్డింగ్ ఊడిపోవటంతో 10మీటర్ల ఎత్తునుంచి సిమెంటు పెద్ద శబ్దంతో కాంక్రీట్ కిందపడిపోయింది. ప్రమాద స్థలంలో ఎవరూ లేకపోవటంతో పెనుముప్పు తప్పింది. ఈ ప్రమాదాలు జరిగిన సమయంలో జెన్కో డైరెక్టర్ సీ రాధాకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ సమీపంలోనే ఉన్నట్టు సమాచారం

'పది' విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి: ఎంఈవో

జూలూరుపాడు, జనవరి 5: పదోతరగతి విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యాలను పెంపొందించి నూరు శాతం ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో వెంకట్ కోరారు. శుక్రవారం మండల స్థాయి మానేటరింగ్ బృందం పాపకొల్లు, గుండెపుడి ఉన్నత పాఠశాలలు, జూలూరుపాడులోని సెయింట్ ఆంథోనీ పాఠశాలలను సందర్శించింది. ఆయా పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు సంబంధించిన ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-3, ఎఫ్ఎ-4, ఎస్ఎ-1ల పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ వర్కులను పరిశీలించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల ప్రతిభను అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్ట్ వర్క్స్, ఉపాధ్యాయుల మూల్యాంకనం తదితరాలలో లోపాలు తలెత్తితే మానేటరింగ్ బృందం అవసరమైన సూచనలు చేస్తుందన్నారు. త్వరలోనే జిల్లా స్థాయి మానేటరింగ్ బృందం పాఠశాలను సందర్శిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానేటరింగ్ బృందం లీడర్ ఆదినారాయణ, సభ్యులు విజయలక్ష్మీ, జి.బాలకృష్ణ, జహంగీర్‌షరీఫ్, ఆర్.శ్రీనివాసరావు, సత్యం, శర్మ తదితరులు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో త్రీఆర్స్ పరిశీలనకు బృందం రాక..

పాఠశాలల్లో నిర్వహించిన త్రీఆర్స్ కార్యక్రమం అమలు, విద్యార్థులు సాధించిన ప్రగతిని పరిశీలించేందుకు ఈ నెల 8, 9వ తేదీలలో రాష్ట్ర పరిశీలన బృందాలు మండలంలో పర్యటించనున్నట్లు ఎంఈవో తెలిపారు. ఈ బృందాలు పాఠశాలలను సందర్శించి, త్రీఆర్స్ కార్యక్రమం అమలు, విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తాయన్నారు. ప్రధానోపాధ్యాయులు, రికార్డులు, ప్రీ, పోస్టు పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.



సెయింట్ఆంథోనీ పాఠశాలలో జవాబుపత్రాలను పరిశీలిస్తున్న ఎంఈవో, బృందం సభ్యులు

పాల్వంచ కాలనీల్లో తాగునీటి అవస్థలు

- రహదారి విస్తరణ, భగీరథ పనులే కారణం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

పాల్వంచ టౌన్, జనవరి 5: పాల్వంచ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీరు సరఫరా లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయరహదారి విస్తరణ పనులు, మిషన్ భగీరథ పైపులైన్ల ఏర్పాటు క్రమంలో పలు ప్రాంతాల్లో పైపులైన్లు ధ్వంసమై, తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయమేర్పడింది. దీంతో పాత పాల్వంచ, ఇందిరానగర్, ప్రశాంతి, వెంగళరావు, జర్నలిస్టు కాలనీ, వికలాంగుల, జయమ్మ, వనమా కాలనీలు సహా పలు ప్రాంతాల్లో మంచినీటికి ఇబ్బందులు తలెత్తాయి. దీంతో సీ కాలనీ గేటు సమీపంలో కేటీపీఎస్ వారు ఏర్పాటుచేసిన నల్లా వద్ద నుంచి స్థానికులు తాగునీరు పట్టుకెళుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో లీకేజీలు అరికట్టి అధికారులు నీళ్లు సరఫరా చేసినా వనమా కాలనీ తదితర ప్రాంతాల్లో మళ్లీ లీకేజీలు ఏర్పడి బురద నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. లీకేజీలను అరికట్టి మంచినీటి సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఈ విషయమై మునిసిపల్ ఏఈ రాజేష్ స్పందిస్తూ తాగునీటి ఇబ్బందులు నిజమేనని, రోడ్డు విస్తరణ పనులు, మిషన్ భగీరథ పైపులైన్ల ఏర్పాటుతో అంతరాయమేర్పడిందన్నారు. చాలా వరకు లీకేజీలు పూర్తిచేశామని, తాగునీరు సక్రమంగా అందించేందుకు కృషిచేస్తామన్నారు. ఇటీవల నెల రోజులపాటు తాగునీరు రాలేదని, వారం, పది రోజులుగా వస్తున్నా.... అవి సక్రమంగా రావడంలేదని ప్రసన్న(ప్రశాంతినగర్) తెలిపింది. మిషన్ భగీరథ పనులతో పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడాయని, అధికారులు సరిచేసినా 10 రోజులుగా బురదగా నీళ్లు వస్తున్నాయని వనమా కాలనీ వాసి ఆశాలు వాపోయింది. అధికారులు స్పందించాలని కోరారు.



పంపు వద్ద బారులుగా క్యాన్లు పెట్టిన దృశ్యం



భగీరథ పైపులైన్ పనులు జరుగుతున్న దృశ్యం (ఫైల్)

టీడీపీ రాష్ట్రస్థాయి శిక్షణలో ఇల్లెందు నేతలు

ఇల్లెందుటౌన్, జనవరి 5: హైదరాబాద్‌లో శుక్రవారం టీడీపీ తెలంగాణ రాష్ట్రస్థాయి విద్య,వైజ్ఞానిక శిక్షణ తరగతులకు ఇల్లెందునుంచి పలువురు టీడీపీ నేతలు హాజరయ్యారు. పట్టణ అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ రోజురోజుకూ బలపడుతోందని పేర్కొన్నారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ముద్రగడ వంశీ

కాంగ్రెస్‌తోనే సుస్థిరపాలన

- కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్

ఇల్లెందురూరల్, జనవరి 5: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు సంక్షేమ పథకాల అమలు, సుస్థిరపాలన సాధ్యమవుతుందని కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. మండల పరిధిలోని చల్లసముద్రం పంచాయతీలో శుక్రవారం వివిధ పార్టీలనుంచి పలువురు బలరాంనాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వాలతో ప్రజలకు ఒరిగిందేమిలేదన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలను ఇబ్బందులుపెడుతున్నారని ఆరోపించారు. 2019లో కేంద్రంలో, రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రానుందని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు బానోత్ హరిప్రియ, హరిసింగ్‌నాయక్, మండల అధ్యక్షులు పోశం వెంకటేశ్వర్లు, దాస్యం ప్రమోద్, ఆజాం, ఎండీ. యాకూబ్‌పాష బొల్లిరామారావు, బింగి వెంకన్న, బన్నా, జనార్దన్, శ్రీను, బుచ్చయ్య, సరిలాల్, గాజులవెంకన్న, పెల్లి శ్రీనివాసరెడ్డి, బానోత్ దేవ్ల, శంకర్, సనప వీరభద్రం, దొంతు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



బలరాంనాయక్ సమక్షంలో పార్టీలో చేరుతున్న చల్లసముద్రం గ్రామస్థులు

ఇదేనా.. రక్షణ..?

- భయాందోళనలో ప్రజలు

పట్టించుకోండి..

టేకులపల్లి, జనవరి 5: అడుగడుగునా విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా ఉన్నా.. ట్రాన్స్‌కో అధికారులు తమకేమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు జనావాసాలమధ్య కంచెలేకుండానే ఏర్పాటుచేశారు. టేకులపల్లిలో టేకులపల్లి-ముత్యాలపాడురోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌తో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళనచెందుతున్నారు. ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్‌లకు తగిలిన పశువులు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు తక్షణమే కంచెలను ఏర్పాటుచేసి.. ప్రజలు, మూగజీవాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



ముత్యాలపాడు రహదారిపై ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఎన్నికల హామీలను నెరవేర్చని కేసీఆర్

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

ఇల్లెందుటౌన్, జనవరి 5: గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగిస్తున్నాడని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఇల్లెందులో కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులసమావేశంలో మాట్లాడారు. సకలజనులు తెలంగాణ ప్రజలంతా ఏకమై పోరాడితే సోనియాగాంధీ నేతృత్వంలో తెలంగాణ ఏర్పడిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలమేరకు ఏర్పడిన రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. విద్యార్థులు, యువకులు తీవ్ర నిరాశ,నిస్పృహల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ అనుసరిస్తున్న విధానాలతోనే టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని వివరించారు. తెలంగాణలో రోజురోజురూ కాంగ్రెస్ పార్టీ బలపడుతోందన్నారు. మోదీ ప్రభుత్వం పెద్ద నోట్లరద్దుతో సామాన్యప్రజలు ఇబ్బందులపాలయ్యారని విమర్శించారు. మంచినీళ్లపైనా జీఎస్టీ అమలు కావడం మోదీ అసమర్థ విధానాలే కారణమన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకిరావడం ఖాయమన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య అవినీతి పాలనచేస్తున్నాడని ఆరోపించారు. రాబోయే కాలంలో ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ మరోమారు విజయఢంకా మోగిస్తుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు రామిరెడ్డి కృష్ణారెడ్డి, చీమల వెంకటేశ్వర్లు, ధళ్‌సింగ్, హరిప్రియనాయక్, డాక్టర్ రాంచంద్రనాయక్, సుదర్శన్‌కోరి, జీవీ.భద్రం, రామిశెట్టి జగన్నాథం, పోశం వెంకటేశ్వర్లు, ఉప్పు శ్రీను, ఈశ్వర్‌గౌడ్, మాంజ్యానాయక్ పాల్గొన్నారు.

గుర్తింపులేని ప్రైవేటు పాఠశాలల్ని మూసివేయాలి

- ఎంఈవో శ్రీనివాసరావు

ఇల్లెందురూరల్, జనవరి 5: మండలంలో గుర్తింపులేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలను తక్షణమే మూసివేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీచేసినట్లు ఎంఈవో పిల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఇల్లెందులోని శ్రీరామకృష్ణ విద్యాలయాన్ని మూసివేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఉత్తర్వు కాపీలను పాఠశాల యాజమాన్యానికి అందజేసినట్లు తెలిపారు. గుర్తింపులేని పాఠశాలలో విద్యార్థులను ఎవరూ చేర్పించవద్దని, వారి భవిష్యత్తును ఇబ్బందుల్లో నెట్టవద్దని తల్లిదండ్రులకు ఎంఈవో సూచించారు.

లారీడ్రైవర్ల అగ్రిమెంట్ అమలుచేయాలి

- ఇఫ్టూ రాష్ట్ర నాయకుల డిమాండ్

ఇల్లెందురూరల్, జనవరి 5: లారీ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాల అగ్రిమెంట్‌ను వెంటనే అమలు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ముకుందాపురంలో శుక్రవారం జరిగిన లారీ డ్రైవర్ల, క్లీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా లారీ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాల యజమానులు పెంచాలని డిమాండ్‌చేశారు. వేతనాల అగ్రిమెంట్ చేయకుండా తాత్సారంచేస్తే సహించమన్నారు. తక్షణమే యూనియన్ నాయకులతో చర్చలు జరిపాలని ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ.యాకూబ్, సారంగపాణి, తొడేటి నాగేశ్వర్‌రావు, పాయం వెంకన్న పాల్గొన్నారు.

పంటనష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య
- తహసీల్దారు కార్యాలయం ఎదుట ఎన్డీ ధర్నా

కారేపల్లి, జనవరి 5: ప్రకృతి వైపరీత్యాలు, గులాబీరంగు పురుగులతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మండల ఎన్డీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మోటర్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. రైతులు పంటలసాగులో ఎంతో నష్టపోతున్నారని, నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండోతేదీనుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని మండాలల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ నెల 11న జిల్లా కేంద్రంలో రైతులతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్టు గుమ్మడి నర్సయ్య తెలిపారు. అనంతరం తహసీల్దారు తేళ్ల శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో గగ్రం అచ్చయ్య, అవుల వెంకటేశ్వర్లు, నిమ్మరాజు, ఎం.శివలింగం, అర్జున్‌రావు, టి.వెంకటేశ్వరరావు, ప్రకాష్ పాల్గొన్నారు.



ప్రదర్శనగా వస్తున్న ఎన్డీ నాయకులు

సీపీఐ సీనియర్‌నేత కొమరయ్య మృతి

ఇల్లెందురూరల్, జనవరి 5: మండలపరిధిలోని రొంపేడ్ పంచాయతీ 21ఫిట్ ఏరియాకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు నల్లాల కొమరయ్య(93) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. సీపీఐలో ఏడుదశాబ్దాలుగా పనిచేస్తూ.. మంచి నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ, పార్టీలో గుర్తింపు పొందారు. ఆయన మృతిపట్ల స్థానిక సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సారయ్య, మునిసిపల్ వైస్‌చైర్మన్ బాసశ్రీనివాస్, మండల కార్యదర్శి రఘుపతి, పట్టణకార్యదర్శి బందం నాగయ్య, బోళ్లం సూర్యం, ఏపూరి బ్రహ్మం నివాళుర్పించారు.

ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందుటౌన్, జనవరి 5: ఎలాంటి హక్కులకు నోచుకోని ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఇల్లెందుపట్టణంలోని గోవింద్‌సెంటర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు సీఐటీయూలో చేరారు. దేశంలో, రాష్ట్రంలో కార్మికచట్టాలను ఉల్లంఘిస్తూ.. కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు కొండపల్లి శ్రీధర్, తాళ్లూరి కృష్ణ, దేవులపల్లి యాకయ్య, నబీ, ఆలేటి కిరణ్, వజ్జా సురేష్, బయ్యా సర్వయ్య పాల్గొన్నారు.

దమ్మాలపాటికి కాంగ్రెస్‌నేతల పరామర్శ

ఇల్లెందు, జనవరి 5: సాహితీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దమ్మాలపాటి వెంకటేశ్వర్‌రావు(డీవీ)ని శుక్రవారం సాయంత్రం రాష్ట్ర మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆయన సోదరుడు రాంరెడ్డి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాంచంద్రునాయక్, నందకిషోర్, సుదర్శన్‌కోరి పరామర్శించారు. డీవీ తండ్రి శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం విదితమే.



డీవీని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

మధ్యాహ్నభోజనాన్ని సక్రమంగా అమలుచేయాలి

- ఎంపీడీవో జాఫర్‌ఖాన్ సూచన

ఇల్లెందురూరల్, జనవరి 5: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నభోజనాన్ని సక్రమంగా అమలుజరిగేలా ఉపాధ్యాయులు చొరవతీసుకోవాలని ఎంపీడీవో ఎండీ.జాఫర్‌ఖాన్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయుల సమీక్షాసమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. పాఠశాలలో మౌలికవసతుల కల్పన, విద్యార్థుల ఉత్తీర్ణతపై దృష్టిపెట్టాలని కోరారు.ఎంఈవో పిల్లి శ్రీనివాసరావు, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

మండలంలో వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్ని వేగిరపరచాలని ఎంపీడీవో జాఫర్‌ఖాన్ కోరారు. రాఘబోయినగూడెం పంచాయతీలో మరుగుదొడ్ల నిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం సదాశయంతో చేపడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్పీటీసీ చంద్రఅరుణ, ఈవోపీఆర్డీ కనకదుర్గ, సర్పంచ్ కునుసోత్‌రాము, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ పాల్గొన్నారు.

బహుళజాతి కంపెనీల కోసమే రోడ్లవిస్తరణ : ఎన్డీ నేతలు

టేకులపల్లి, జనవరి 5: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలకు లాభాలార్జించేలా చట్టాలను మార్చుతూ.. వారికనుకూలంగా రోడ్లవిస్తరణ చేపడుతున్నారని ఎన్డీ జిల్లానాయకులు ఎట్టి ప్రసాద్, ఊక్లా అన్నారు. టేకులపల్లిలో భూక్యా హర్జా అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఎన్డీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఇళ్లు, వ్యాపారసముదాయాలను కోల్పోతున్నారని.. వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఇఫ్టూరీజియన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇల్లెందు సినిమాలు

కళాంజలి	- ఎంసీఏ
లలిత్ కళామందిర్	- టెన్
శ్రీ సీతారామ	- ఒక్క క్షణం